PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 55 | విజయవాడ, సోమవారం 25 సెప్టెంబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 25 September 2023 | Rs

తీరంలో మరో కుంపటి

- నక్కపల్లికి బల్క్‌డ్రగ్ పార్క్‌ను తరలిస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం
- కాలుష్య భయంతో స్థానికుల ఆందోళన

3



రోయింగ్‌లో తీన్‌మార్

6



కెబి భవన్‌లో జరిగిన సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, వేదికపై బి.తులసీదాస్, డి.రమాదేవి, వి.వెంకటేశ్వర్లు, వై.కేశరావు, వి.కృష్ణయ్య, కె.హరిబాబు

ఆదర్శ కమ్యూనిస్టు కొరటాల

- ఆయన ఆశయాల సాధనకు కృషి
- శతజయంతి సభల్లో వక్తలు

ప్రజాశక్తి- యంత్రాంగం

కొరటాల సత్యనారాయణ ఆదర్శ కమ్యూనిస్టని, నిరంతర అధ్యయనశీలని పలువురు కొనియాడారు. ఆయన ఆశయాల సాధనే కొరటాలకు అర్పించే నిజమైన నివాళని పేర్కొన్నారు. కొరటాల సత్యనారాయణ శత జయంతి ఉత్సవాలను ఏడాది పాటు జరపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు, ప్రజాశక్తి సిబ్బంది పాల్గొన్నారు. సిపిఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి, పొలిట్‌బ్యూరో పూర్వ సభ్యులు కొరటాల సత్యనారాయణ శత జయంతి కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పలుచోట్ల ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాలు కొనసాగిస్తామని ప్రతినబూనారు. విజయవాడలోని సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన జయంతి కార్యక్రమంలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పాతతరానికి, కొత్త తరానికి వారధి కొరటాల అని పేర్కొన్నారు. రైతు ఉద్యమంతో పాటు చేనేతలాంటి వృత్తి సంఘాలు, కౌలు రైతు సంఘాల లాంటివి స్థాపించి ఆ సంఘాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. నిశితమైన పరిశీలన, పూర్వాపరాలపై అధ్యయనం చేసేవారని, అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలను కలిసి సమస్యలపై ఒక నిర్ణయానికి వచ్చేవారని అన్నారు. సమస్య పరిష్కారానికి ఒకవైపు ఉద్యమిస్తూ, మరోవైపు అధికారులతో కలిసి చర్చించేవారని, అవసరమైతే న్యాయపోరాటం చేసేవారని తెలిపారు. కార్యకర్తల పట్ల ఎంతో ఆప్యాయంగా ఉండేవారన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా పరిష్కరించేవారని గుర్తు చేశారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు ప్రసంగించారు. వడ్డేశ్వరంలోని కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ, గుంటూరు బాపనయ్య భవన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కొరటాల సత్యనారాయణ విద్యార్థి దశ నుండే అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని, నిర్బంధాలు, ఆటుపోట్లను ఎదుర్కొని చివరి వరకూ ఆదర్శ కమ్యూనిస్టుగా జీవించారని గుర్తు చేశారు. ప్రస్తుతం కమ్యూనిస్టు ఉద్యమంపై నిర్బంధాలు ఉధృతంగా ఉన్నాయని, వర్గ పోరాటాల ద్వారానే కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్, ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన మిగతా 5లో

నన్ను చంపడానికి కుట్ర

- బిఎస్‌పి ఎంపి అలీ

న్యూఢిల్లీ : తన హత్యకు కుట్ర జరుగుతోందని బిఎస్‌పి ఎంపి డానిష్ అలీ ఆరోపించారు. న్యూఢిల్లీలోని తన నివాసం వద్ద ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లోక్‌సభలో తనపై బిజెపి ఎంపి రమేష్ బిధూరి మాటలతో దాడి చేసిన తరువాత, ఇప్పుడు పార్లమెంట్ వెలుపల తనను భౌతికంగా అంతమొందించడానికి కుట్ర జరుగుతోందని చెప్పారు. బిజెపి ఎంపి నిషికాంత్ దూబే ఆరోపణలన్నీ నిరాధారమని చెప్పారు. 'ఈ నిరాధారమైన ఆరోపణపై దర్యాప్తు చేయవలసిందిగా స్పీకర్‌ను అభ్యర్థిస్తున్నాను. ఈ ఆరోపణలు చేసిన నిషికాంత్ దూబేపై పార్లమెంట్ నిబంధనల ప్రకారం కేసు కూడా పెట్టవచ్చు' అని అన్నారు. ఇటీవల పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల సందర్భంగా గురువారం లోక్‌సభలో చంద్రయాన్-3పై చర్చ జరుగుతున్న సమయంలో అలీపై బిజెపి ఎంపి బిధూరి తీవ్ర అవమానకరమైన వ్యాఖ్యలు చేశారు. దీంతో అలీ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. స్పీకర్ బిధూరిని మందలించి వదిలేశారు. బిధూరిని పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేయాలని ప్రతిపక్షాలు పట్టుబడుతున్నాయి.


దూబే లేఖలో ఏముంది?

ఈ నేపథ్యంలో మరొక బిజెపి ఎంపి నిషికాంత్ దూబే అలీపై ఆరోపణలు చేయడంతోపాటు స్పీకర్ ఓం బిర్లాకు శనివారం లేఖ రాశారు. గురువారం అలీ సభలో అసహ్యకరంగా ప్రవర్తించారని, ప్రధాని మోడీపై విపరీత వ్యాఖ్యలు చేశారని దూబే తన లేఖలో ఆరోపించారు. ప్రధానిపై అలీ అత్యంత అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడం బిధూరిని రెచ్చగొట్టిందని లేఖలో దూబే పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో చేరాలని అలీ భావిస్తున్నారని, దేశంలో మైనారిటీలు సురక్షితంగా లేరని ప్రచారం చేయడానికి కాంగ్రెస్, అలీ కుట్ర పన్నారని ఆరోపించారు.

మూడో భాషగా సంస్కృతం!

విద్యార్థులపై బలవంతంగా రుద్దేయత్నం

కేంద్రానికి లొంగి ఎన్‌ఇపి-2020 అమలు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంస్కృతాన్ని విద్యార్థులపై బలవంతంగా రుద్దడానికి రంగం సిద్ధమైంది. పాఠశాల విద్యలో మూడో భాషగా దీనిని అమలు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను పాఠశాల విద్యాశాఖ దాదాపు పూర్తిచేసింది. విద్యాశాఖ మంత్రి సంతకం చేయగానే మూడో భాషగా సంస్కృతంఅమలు చేస్తూ అధికారిక ఉత్తర్వులు త్వరలో విడుదల కానున్నాయి. కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానం(ఎన్‌ఇపి)-2020లో భాగంగా దీనిని అమలు చేస్తున్నారు. సంస్కృతాన్ని బలవంతంగా రుద్దాలని కేంద్రం చేసిన ప్రయత్నాన్ని పక్క రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు ఇప్పటికే వ్యతిరేకించాయి. కేంద్రప్రభుత్వం షరతులకు లొంగిన రాష్ట్రప్రభుత్వం వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లను ఏర్పాటు చేయడంతో పాటు ప్రజలపై చెత్తపన్ను వంటి భారాలు మోపింది. దేశాన్ని కాషాయికరణలో భాగంగా సంస్కృతం అమలు,చరిత్ర తొలగింపు అంశాలు ఎన్‌ఇపి-2020లో అంతర్లీనంగా ఉన్నాయి. ఎన్‌ఇపిలో భాగంగానే ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం తరగతుల విలీన ప్రక్రియ అమలు చేయడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ప్రవేశాలు తగ్గి కొన్ని పాఠశాలలు మూతపడే పరిస్థితికి వచ్చాయి. ఎన్‌ఇపిలో భాగంగానే రాష్ట్రప్రభుత్వం సిబిఎస్‌ఇ సిలబస్‌ను ముందుకు తీసుకొచ్చింది. ఇప్పటికే 1100 పాఠశాలలను సిబిఎస్‌ఇగా మార్చింది. సిబిఎస్‌ఇ అమలు చేసే జాతీయ విద్యాపరిశోధన శిక్షణ మండలి(ఎన్‌సిఇఆర్‌టి) ఇటీవల కొంత సిలబస్‌ను తొలగించింది. డార్విన్ పరిణామా సిద్ధాంతం, మొగల్ చరిత్ర, ఆర్‌ఎస్‌ఎస్ నిషేధం, భగత్ సింగ్ చరిత్ర వంటి అంశాలను తొలగించింది. ఎన్‌సిఇఆర్‌టిలోని కొంత సిలబస్‌ను రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణా మండలి(ఎస్‌సిఇఆర్‌టి) కూడా అమలు చేసేందుకు ప్రయత్నిస్తోంది. 9వ తరగతిలోని హిందీ సబ్జెక్టులో మొత్తం ఉత్తరభారత దేశ హిందీ మాండలికాలను ప్రవేశపెట్టి దక్షిణ భారతదేశ చరిత్రను హిందీ పాఠ్యాంశాల నుంచి ఎస్‌సిఇఆర్‌టి తొలగించింది. ఎన్‌ఇపిలో భాగంగా సంస్కృతాన్ని మొదటి భాషగా అమలు చేయాలని స్వరూపనంద స్వామి, చిన్నజీయర్ స్వామి వంటి హిందూ మఠాధిపతులు రాష్ట్రప్రభుత్వంపై ఒత్తిడి చేశారని సమాచారం. మాతృభాష తెలుగును నిర్లక్ష్యం చేసిందని విద్యావేత్తలు, భాషాభిమానులు నిరసనలు వ్యక్తం చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. వాడుకలో లేని సంస్కృత భాషను ప్రవేశపెట్టడం వల్ల విద్యార్థులకు అదనంగా ప్రయోజనం ఉండదని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు వ్యాఖ్యానించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో ఇప్పటికే బలవంతపు బోధన జరుగుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో మూడో భాష కింద ఇంగ్లీష్ ఉంది. సంస్కృతాన్ని మూడో భాషగా అమలు చేస్తే ఇంగ్లీష్‌ను రెండో భాషగా చేస్తారా? లేదా మొదటి భాషగా అమలు చేస్తారా అనేది ప్రశార్ధకంగా మారనుంది. రెండో భాషగా ఉన్న హిందీని ఏం చేస్తారనేది మరో ప్రశ్న తలెత్తనుంది. భవిష్యత్తులో సంస్కృతాన్ని మొదటి భాషగా, ఇంగ్లీష్‌ను రెండో భాషగా, తెలుగును ఆప్షనల్ సబ్జెక్టుగా తీసుకొచ్చే అవకాశం ఉందని కొందరు అంటున్నారు.

5 వరకు చంద్రబాబు రిమాండ్

- ముగిసిన సిఐడి కస్టడీ
- పొడిగించాలని పిటిషన్
- విచారణలో ఏం గుర్తించారో బయటపెట్టాలి : చంద్రబాబు

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో, రాజమహేంద్రవరం ప్రతినిధి

స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కేసులో అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఉన్న టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రిమాండ్‌ను మరో 11 రోజులు అక్టోబర్ 5 వరకు పొడిగిస్తూ ఎసిబి కోర్టు ఆదేశించింది. ఈ నెల 9న చంద్రబాబునాయుడును పోలీసులు అరెస్టు చేశారు. మొదట ఈ నెల 22వ తేదీ వరకు 14 రోజుల రిమాండ్‌ను సిబిఐ కోర్టు విధించింది. 22వ తేదీన రిమాండ్‌ను 24 వరకు పొడిగిస్తూ రెండు రోజుల సిఐడి కస్టడీకి అనుమతించింది. సిఐడి కస్టడీ, రిమాండ్ గడువు ముగియడంతో ఆదివారం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుండే చంద్రబాబునాయుడును విజయవాడలోని ఎసిబి కోర్టులో వర్చువల్‌గా జడ్జి ముందు ప్రవేశ పెట్టగా. ఆన్‌లైన్ ద్వారా విచారణ చేపట్టారు. చంద్రబాబునాయుడు రిమాండ్‌ను పొడిగించాలని సిఐడి న్యాయవాది కోరగా, అక్టోబరు 5 వరకు పొడిగిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. విచారణ సందర్భంగా సిఐడి అధికారులు ఏమైనా ఇబ్బంది పెట్టారా? థర్డ్ డిగ్రీ ప్రయోగించారా? ఏమైనా అసౌకర్యం కలిగిందా? వైద్య పరీక్షలు చేయించారా? అని చంద్రబాబునాయుడిని న్యాయమూర్తి ప్రశ్నించారు. విచారణకు తాను సహకరించానని చంద్రబాబు చెప్పారు. ఈ కేసు విచారణలో ఏమి గుర్తించారో బహిర్గతం చేయాలని జడ్జిని చంద్రబాబునాయుడు కోరగా, అలా చేయడం కుదరదని, కోర్టుకు విచారణకు సంబందించిన అంశాలను సిఐడి పిటిషన్‌లో వేసినందున మీ న్యాయవాదుల ద్వారా తెలుసుకోవచ్చని జడ్జి బదులిచ్చారు. ఈ సందర్భంగా కస్టడీని పొడిగించాలని సిఐడి మిగతా 2లో



ఆంధ్ర, తెలంగాణ సరిహద్దు వద్ద భారీ పోలీస్ బందోబస్తు

సరిహద్దు వద్ద పోలీసుల తనిఖీలు

- ప్రతి వాహనం క్షుణ్ణంగా పరిశీలన

2



20 నెలలుగా జీతాల్లేవ్

- చంద్రయాన్-3 లాంచ్‌ప్యాడ్ నిర్మాణంలో భాగమైన హెచ్‌ఇసి ఉద్యోగుల దుస్థితి
- పూట గడవక కూలి పనులకు వెళ్తున్న వైనం

5

రైల్వేల ఆధునీకరణకు ప్రాధాన్యత

- కేంద్ర సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవార్
- విజయవాడలో వందే భారత్ రైలు ప్రారంభం



ప్రయాణికులతో మాట్లాడుతున్న భారతి ప్రవీణ్ పవార్, ఎంపి కేశినేని నాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైల్వేల ఆధునీకరణకు కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ అన్నారు. స్వయం ఆధారిత స్వయం సుస్థిరతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. రైలు ప్రయాణం, రైలు మౌలిక సదుపాయాల నవీకరణకు సంబంధించి 2023 ఎంతో కీలకమైందన్నారు. విజయవాడ - చెన్నై మధ్య వందేభారత్ ఎక్స్ ప్రెస్ రైలును ఆమె విజయవాడ రైల్వే స్టేషన్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దక్షిణ మధ్య రైల్వేలో తాజాగా ప్రారంభిస్తున్న వందేభారత్ రైలు మూడోదన్నారు. రైలును ప్రారంభించిన అనంతరం ప్రయాణికులు, పిల్లలతో ఆమె మాట్లాడారు. రైలులో సౌకర్యాలు ఎలా ఉన్నాయి? తదితర వివరాలను డాక్టర్ భారతితోపాటు విజయవాడ ఎంపి కేశినేని నాని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డిఆర్‌ఎం నరేంద్ర ఎ పాటిల్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎడిఆర్‌ఎం డి.శ్రీనివాసరావు, ఎడిఆర్‌ఎం ఆపరేషన్స్, ఎం.శ్రీకాంత్ పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాలకూ అనుసంధానిస్తాం : ప్రధాని

దేశవ్యాప్తంగా తొమ్మిది వందే భారత్ రైళ్లను ప్రధాని నరేంద్రమోడీ ఆదివారం ఇక్కడ వర్చువల్‌గా ప్రారంభించారు. 11 రాష్ట్రాల్లోని మతపరమైన, పర్యాటక ప్రాంతాలను కలుపుతూ తొమ్మిది వందే భారత్ రైళ్లను జెండా ఊపి ప్రారంభించే ముందు మోడీ ప్రసంగించారు. భారతీయ రైల్వేలను ఆధునీకరణకు తమ ప్రభుత్వం కషి చేస్తోందని ఆయన అన్నారు. వందే భారత్ రైళ్లకు ఆదరణ నిరంతరం పెరుగుతోందని, ఈ రైళ్లు దేశంలోని అన్ని ప్రాంతాలను అనుసంధానించే రోజు ఎంతో దూరంలో లేదని అన్నారు. కొత్త వందే భారత్ రైళ్లు విజయవాడ-చెన్నై (రేణిగుంట మీదుగా), ఉదయపూర్-జైపూర్, తిరునెల్వేలి-మధురై-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు, పాట్నా-హౌరా, కాసరగోడ్-తిరువనంతపురం, రూర్కెలా-భువనేశ్వర్-పూరి, రాంచీ-హౌరా, జామ్‌నగర్-అహ్మదాబాద్‌గా ప్రయాణిస్తాయి. ప్రయాణికుల అభిప్రాయాల మేరకు ఈ రైళ్లు కొత్త ఫీచర్లతో అందుబాటులోకి వచ్చాయి.

టిటిడి ఎలక్ట్రిక్ బస్సు చోరీ

బ్యాటరీ అయిపోవడంతో వదిలివెళ్లిన దొంగ



నాయుడుపేట వద్ద బస్సును గుర్తించిన పోలీసులు

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి)కి చెందిన ఎలక్ట్రిక్ బస్సు చోరీకి గురైంది. గుర్తు తెలియని వ్యక్తి ఈ బస్సును అపహరించాడు. బస్సు బ్యాటరీ ఛార్జింగ్ అయిపోవడంతో దీనిని రోడ్డు పక్కనే వదిలేసి వెళ్లిపోయాడు. స్థానికంగా కలకలం రేపిన ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ సంస్థ టిటిడికి గతంలో పది ఎలక్ట్రిక్ బస్సులను ఉచితంగా ఇచ్చింది. ఈ బస్సులను ధర్మరథాల పేరుతో తిరుమలలో సందర్శకుల కోసం టిటిడి ఉచితంగా నడుపుతోంది. తిరుమలలోని గరుడాద్రి నగర్ వర్క్‌షాపులో ఉంచిన ఒక బస్సును గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం వేకువజామున అపహరించుకుపోయాడు. ఈ విషయాన్ని ఉదయం సుమారు 8.30 గంటల సమయంలో టిటిడి అధికారులు గుర్తించి దర్యాప్తు చేపట్టారు. తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో ఈ బస్సు టోల్‌గేట్ దాటినట్లు ఈ బస్సుకు ఉన్న జిఎన్‌సి సిస్టం ద్వారా విజిలెన్స్ అధికారులు గుర్తించారు. నాయుడుపేట వద్ద బస్సు లోకేషన్ చూపించింది. దీంతో, అక్కడి పోలీసులకు టిటిడి అధికారులు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లి చూడగా, బస్సు అక్కడ ఉంది. ఛార్జింగ్ అయిపోవడంతో బస్సుని రోడ్డు పక్కన నిలిపివేసి దొంగ పరారయ్యాడు. పోలీసులు ఈ బస్సును స్వాధీనం చేసుకొని టిటిడి అధికారులకు అప్పగించారు. ఈ బస్సు ఖరీదు రూ.1.44 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. నిఘా వర్గాల వైఫలమే ఈ ఘటనకు కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, వారం రోజుల క్రితం టిటిడికి చెందిన ఎలక్ట్రిక్ కారు కూడా మిస్సయినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. ఒంటిమిట్ట రామాలయం వద్ద ఈ కారును గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అయితే, కారు మిస్సింగ్ ఘటనపై పోలీసులకు టిటిడి అధికారులు ఫిర్యాదు చేయనట్లు సమాచారం.

ఇజ్రాయిల్ మరో ఘాతుకం

- ఇద్దరు పాలస్తీనియన్ల కాల్చివేత

నౌరోశామ్ శరణార్థి శిబిరం (వెస్ట్‌బ్యాంక్): యూదు దురహంకార ఇజ్రాయిల్ తాజాగా మరో ఘాతుకానికి పాల్పడింది. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్ ఉత్తర ప్రాంతంలోని నౌరోశామ్ శరణార్థి శిబిరంపై ఆదివారం తెల్లవారు జామున 2 గంటల ప్రాంతంలో ఇజ్రాయిలీ సైన్యం దాడి చేసి ఇద్దరు పాలస్తీనీయులను కాల్చి చంపినట్లు పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. చనిపోయిన ఇద్దరిని ఒసైడ్ అబుల్ అలీ(21), అబ్ద్ అల్ రెహ్మాన్ అబు దగాష్ (32)గా గుర్తించారు. ఇజ్రాయిల్ సైన్యం హమాస్ కార్యాలయాలను, ఇళ్లను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులకు తెగబడింది. శరణార్థి శిబిరంలోని మౌలిక సదుపాయాలను నాశనం చేసింది. పాలస్తీనా అథారిటీని దెబ్బ తీసి ఈ ప్రాంతంలో తన ఆధిపత్యాన్ని ఎవరూ సవాల్ చేయకూడదన్న దాంతో ఇజ్రాయిల్ ఈ విధమైన అఘాయిత్యాలకు తెగబడుతోంది. ఇటీవల కాలంలో పాలస్తీనీయులపై దాడులు పెరిగిపోయాయి. ఈ ఏడాది ఇంతవరకు 241 మంది అమాయక పాలస్తీనీయులను ఇజ్రాయిల్ సైన్యం పొట్టనపెట్టుకుంది.

అడుగడుగునా అడ్డగింత

అంగన్‌వాడీల మహాధర్నాకు విజయవాడకు రాకుండా ఆటంకాలు, అరెస్టులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్‌వాడీల సమస్యలను అధికారంలో రాగానే అన్నీ పరిష్కరిస్తానని చెప్పిన సిఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నర ఏళ్లు దాటినా పరిష్కరించకపోవడంతో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్‌లు ఆందోళనబాట పట్టారు. సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు అనుబంధ అంగన్‌వాడీ వర్కర్ల సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చి సమస్యలను పరిష్కరించాలని మంత్రులు, అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడంతో సోమవారం విజయవాడలో మహాధర్నాకు పిలుపునిచ్చాయి. అరకొర వేతనాలు, రాజకీయ వేదింపులు, ఐసిడిఎస్ నిర్వీర్యానికి ప్రభుత్వాల కుట్ర విడనాడాలని, తమ సమస్యలను పరిష్కరించాలని, విజయవాడకు బయలుదేరిన అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడే అరెస్టులు చేశారు. అంగన్‌వాడీలను భయభ్రాంతులకు గురిచేసేందుకు పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తల ఇళ్లకు, కేంద్రాలకు వెళ్లి విజయవాడ ధర్నాకు అనుమతులు లేవని వెళితే చర్యలు తీసుకుంటామని నోటీసులు ఇచ్చారు. పోలీసుల నోటీసులను ఏమాత్రం ఖాతరు చేయని అంగన్‌వాడీలు ఆదివారం విజయవాడకు పయనమవడంతో పోలీసులు ఎక్కడికక్కడే వేలాది మందిని అరెస్ట్ చేశారు. బస్‌స్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌లతో పాటు ఇళ్లలో వున్నవారిని, ఆర్‌టిసి బస్సులను, కార్లు జీపులను రహదారులపై ఎక్కడపడితే అక్కడ ఆపి అరెస్టులు చేశారు.



ఎన్‌టిఆర్ జిల్లా మైలవరం పోలీస్ స్టేషన్‌లో నిర్బంధంలో ఉన్న అంగన్‌వాడీలు

నిర్బంధం తగదు : వామపక్షాలు

2



ఫోర్టిఫైడ్ బియ్యం ప్రచార పోస్టర్

తూతూమంత్రంగా ఫోర్టిఫైడ్ ప్రచారం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోర్టిఫైడ్ బియ్యం వినియోగించడం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రచార కార్యక్రమాలు తూతూమంత్రంగా సాగుతున్నాయి. చౌక ధరల దుకాణాలు, ఎండియులు, అంగన్‌వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజన పథకం అమలౌవుతున్న పాఠశాలలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, ప్రజా బాహుళ్య ప్రదేశాల్లోనూ ఫోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన పోస్టర్లు ప్రదర్శిస్తున్నామని పౌర సరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఎక్కడా ఆ పోస్టర్ల జాడ కానరావడం లేదు. పౌర సరఫరాల శాఖ అధికారిక పత్రాల్లోనే 'ప్రచారం' కనిపిస్తోందే తప్ప వాస్తవంగా క్షేత్రస్థాయిలో ప్రచారం కనిపించడం లేదని సంబంధికులు విమర్శిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో పిడిఎస్ కింద చిరుధాన్యాలను అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. బియ్యానికి బదులుగా రాగి, జొన్నలు ఇవ్వాలని నిర్ణయించడంతో పాటు ఆ పంటల విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రోత్సహకాలు అందజేయాలని కూడా నిర్ణయించింది. దీనిపైనా కూడా కార్యాచరణ అక్కడితో ఆగిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

హెల్త్ క్లినిక్స్ అందుబాటులో డెంగీ ఆర్‌డిటి కిట్స్

- ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్స్‌లో రెండు లక్షలకు పైగా డెంగీ ఆర్‌డిటి కిట్స్ అందుబాటులో ఉంచామని ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ప్రాంతీయ, జిల్లా, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రుల్లో ఎలిసా ద్వారా డెంగీ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనలను పాటిస్తున్న ల్యాబ్‌లకు మాత్రమే డెంగీ నిర్ధారణ పరీక్షల నిర్వహణకు అనుమతులు ఇవ్వాలన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖాధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారని, నిబంధనలు పాటించని ల్యాబ్‌లను గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ధరల పట్టిక, ల్యాబ్ టెక్నీషియన్, పెథాలజిస్టుల అర్హతలను కూడా పరిశీలిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మలేరియా, డెంగీ, టైఫాయిడ్‌తో పాటు అన్ని రకాల జ్వరాలకు ఉచితంగా పరీక్షలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. డెంగీకి సంబంధించిన నిర్ధారణ పరీక్షలు సెంటినరీ సర్వైలెన్స్ ఆసుపత్రులు (ఎఎస్‌హెచ్) ఆసుపత్రుల్లో మాత్రమే చేస్తారని, ప్రతి ప్రైవేటు ఆసుపత్రిలో డెంగీకి నిర్ధారణ పరీక్షకు సంబంధించిన ఎలిసా పరీక్ష లేకపోయినట్లయితే రాపిడ్ టెస్ట్‌లో పాజిటివ్ డెంగీ కేసును ప్రభుత్వాసుపత్రికి రెఫరల్ చేయాలని ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ అల్లోపతిక్ ప్రైవేటు మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం నెంబరు 13/2002 ప్రకారం ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లకు అనుభవం కలిగిన నిపుణులు ఉంటే ఆయా జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి తగిన షరతులతో పరీక్షల నిర్వహణకు అనుమతి ఇస్తారని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకునే విధంగా ఆదేశాలిస్తామని పేర్కొన్నారు.

జిపిఎస్‌ను అంగీకరించం

- ప్రభుత్వ పెన్షన్ సాధించుకుందాం
- యుటిఎఫ్ జాతాలో నాయకులు


తూర్పుగోదావరి జిల్లాలో జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

ప్రజాశక్తి- యంత్రాంగం

జిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేస్తామని జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చి మోసం చేశారని యుటిఎఫ్ నాయకులు అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో జిపిఎస్‌ను అంగీకరించబోమని స్పష్టం చేశారు. యుటిఎఫ్ ఆవిర్భవించి 50వ సంవత్సరంలోకి అడిగిడిన నేపథ్యంలో అక్టోబర్ 1న విజయవాడలో జరగనున్న స్వర్ణోత్సవ సభలో ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. అనంతపురం జిల్లాల్లో ప్రారంభమైన యుటిఎఫ్ స్వర్ణోత్సవ జాతా ఆదివారం చిత్తూరు జిల్లాలో, శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ప్రారంభమైన మరోజాతా తూర్పుగోదావరి జిల్లాలో కొనసాగింది. చిత్తూరు జిల్లాలో యుటిఎఫ్ జాతా పుంగనూరు, పలమనేరు, బంగారుపాలెం మీదుగా చిత్తూరు నగరానికి చేరుకుంది. అక్కడ యుటిఎఫ్ కార్యాలయంలో ఆ సంఘం జెండాను ఎగురవేశారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన సభల్లో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించడానికి ఉపాధ్యాయులందరూ సమైక్యం కావాలని కోరారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరించే వరకు విశ్రమించకూడదని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

మరోజాతా తూర్పు గోదావరి జిల్లా గోకవరానికి చేరుకుంది. పలుచోట్ల జరిగిన సభల్లో యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ సంఘం జెండాలను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకోవడానికి యుటిఎఫ్ ఎల్లవేళలా కృషి చేస్తుందని తెలిపారు. ఒపిఎస్ సాధన కోసం కలిసి వచ్చే అన్ని సంఘాలతో కలిసి పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని బలహీనపరిచే జాతీయ నూతన విద్యా విధానాన్ని పునఃపరిశీలించి, మేధావులు, విద్యార్థులతో చర్చించి కామన్ స్కూల్ విధానాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు.

బ్లూ ఎకానమీ ఆలోచనను వెనక్కి తీసుకోవాలి

- ఎఐఎఫ్ఎఫ్‌డబ్ల్యూఎఫ్ డిమాండ్



కెకెడి సమావేశంలో మాట్లాడుతున్న బొడ్డు సత్యనారాయణ

ప్రజాశక్తి-కాకినాడ

బ్లూ ఎకానమీ ఆలోచనను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని జాతీయ మత్స్యకార, మత్స్య కార్మిక సంఘం (ఎఐఎఫ్ఎఫ్‌డబ్ల్యూఎఫ్) డిమాండ్ చేసింది. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలోని యుటిఎఫ్ హోమ్‌లో సంఘం జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యురాలు సిహెచ్.రమణి అధ్యక్షతన జాతీయ వర్క్‌షాప్ ఆహ్వాన సంఘం సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జల్లి రామ్మోహన్ మాట్లాడారు. నవంబర్ 3, 4, 5 తేదీల్లో కాకినాడలో నిర్వహించే సంఘం విస్తృత సమావేశాలను జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు మత్స్యకారుల జీవనభతిని దెబ్బతీసే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోతున్న బ్లూ ఎకానమీ విధానం వల్ల మత్స్యకారులు సముద్ర తీరంపై హక్కును కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా సుమారు ఏడు వేల కిలోమీటర్ల మేర సముద్రం వెంబడి ఈ బ్లూ ఎకానమీ తీసుకొస్తున్నట్లు తెలిపారు. సముద్ర గర్భంలోని సంపదను కార్పోరేట్ వ్యక్తులకు కట్టబెట్టడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయం దుర్మార్గమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 217 జిఒ వల్ల వృత్తిపై ఆధారపడ్డ వారికి కాకుండా, వత్తిపై వ్యాపారం చేసే బడా బాబులకి ఉపయోగమని తెలిపారు. బ్లూ ఎకానమీ ఆలోచనను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎంబిబిఎస్ రెండో విడత కౌన్సిలింగ్ రద్దు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రిజర్వేషన్లకు కోత పెట్టి వైయస్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం చేపట్టిన రెండో విడత ఎంబిబిఎస్ కౌన్సిలింగ్ ప్రక్రియను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. బడుగు బలహీన తరగతుల విద్యార్థులకు అన్యాయం చేసే విధంగా కౌన్సిలింగ్ ఉందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్ విమర్శించారు. ఓపెన్ కేటగిరి సీట్లకు అర్హులైన పేదలకు ఆ సీట్లు కేటాయించకుండా వారికి కూడా రిజర్వు కేటగిరి సీట్లే కేటాయించడం సబబు కాదన్నారు. ఇది పేదలకున్న రిజర్వేషన్లను నిరాకరించడమే అవుతుందన్నారు. 54,857 ర్యాంక్ వచ్చిన బిసి-ఎ అభ్యర్థికి ఓపెన్ కేటగిరిలో సీటు కేటాయించకుండా రిజర్వు కోటాలో సీటు కేటాయించినట్లు ఉదహరించారు. వర్సిటీ తీరును కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) కూడా తీవ్రంగా ఖండించింది. రిజర్వేషన్లను నిరాకరించేలా చేపట్టిన మెడికల్ కౌన్సిలింగ్‌ను వెంటనే రద్దు చేయాలని కెవిపిస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. మెడికల్ సీట్లలో రిజర్వేషన్ల కోత విధించి రాష్ట్ర భ్రుత్వం విద్యార్థుల జీవితాలతో వ్యాపారం చేస్తోందని విమర్శించారు.

చంద్రబాబు అరెస్టుతో భయపడుతున్న జగన్ : అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును అరెస్టు చేసి ముఖ్యమంత్రి జగన్ భయపడుతున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. చంద్రబాబుకు దేశవ్యాప్తంగా వస్తున్న మద్దతు చూసి జగన్ వెన్నులో వణుకు మొదలయిందన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. భయంతోనే ఐటీ ఉద్యోగుల కార్ల ర్యాలీని అడ్డుకున్నారని విమర్శించారు. అధికార బలంతో ర్యాలీని అడ్డుకోవచ్చు గానీ, వచ్చే ఎన్నికల్లో టిడిపి ప్రభంజనాన్ని అడ్డుకోలేరని ఆయన పేర్కొన్నారు.

జగన్ పైశాచిక ఆనందం : యనమల

రాష్ట్ర ప్రజానీకం సమస్యలతో సతమతమౌతుంటే ముఖ్యమంత్రి జగన్ కక్షపూరిత చర్యలతో పైశాచిక ఆనందం పొందుతున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు తీవ్రస్థాయిలో విమర్శించారు. వ్యవసాయం సంక్షోభంలో ఉందని, నిత్యావసరాల ధరలు ఆకాశన్నంటుతున్నాయని, విద్యార్థులు, యువత ప్రజానీకం మొత్తం అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ సమస్యలన్నింటిని వదిలేసి చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి సంబరాలు చేసుకుంటోందని వాపోయారు. అసెంబ్లీలోనూ ఎవరు ప్రశ్నించరాదనే ఉద్దేశ్యంతో వ్యవహరిస్తున్నారని, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు, రాష్ట్ర భవిష్యత్‌కు ప్రమాదంగా మారుతుందని తెలిపారు.

వచ్చే వారం నుంచి 'యువగళం'

- టిడిపి ముఖ్యనేతలతో లోకేష్ చర్చ



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి ప్రధానకార్యదర్శి నారా లోకేష్ వచ్చే వారం నుంచి తన 'యువగళం' పాదయాత్రను తిరిగి ప్రారంభించనున్నారు. ఈ మేరకు టిడిపి ముఖ్యనేతలతో ఆదివారం సమాలోచనలు చేసి ఆయన నిర్ణయించారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టు నేపథ్యంలో 'యువగళం' పాదయాత్ర ఆగిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న లోకేష్ అక్కడి నుంచే టెలికాన్ఫరెన్స్‌లో పార్టీ ముఖ్య నేతలతో ఆదివారం సమావేశమయ్యారు. చంద్రబాబు అరెస్టు, తదనంతర పరిణామాలపై ఆయన చర్చించారు. టిడిపికి మద్దతుగా నిలుస్తున్నవారికి లోకేష్ ధన్యవాదాలు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజోలు నియోజకవర్గం పొదలాడలో 'యువగళం' కొనసాగుతున్న సమయంలో..కర్నూలు జిల్లా నంద్యాలలో చంద్రబాబు అరెస్టు కావడంతో అక్కడితోనే లోకేష్ పాదయాత్ర ఆగిపోయింది. ఈ నేపథ్యంలో 'యువగళం' పాదయాత్రను తిరిగి పొదలాడ నుంచే ప్రారంభిస్తామని లోకేష్ తెలిపారు. వారం రోజుల్లోగా ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసుకొని పాదయాత్ర చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. చంద్రబాబు అక్రమ అరెస్టు, జగన్ రాజకీయ కక్షసాధింపు చర్యలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడతామని తెలిపారు. టిడిపి నాయకులంతా ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వ కక్షసాధింపు చర్యలపై ప్రచారం చేపట్టాలని టెలికాన్ఫరెన్స్ భేటీలో నిర్ణయించినట్లు లోకేష్ తెలిపారు. ప్రజలు, పార్టీ నేతలు చేపట్టిన నిరసన కార్యక్రమాలను ప్రభుత్వం పోలీసులతో అణిచివేయడం, కేసులు నమోదు చేయడాన్ని కూడా తీవ్రంగా ఖండించారు.

సరిహద్దు వద్ద పోలీసుల తనిఖీలు

- ప్రతి వాహనం క్షుణ్ణంగా పరిశీలన



రాజమహేంద్రవరంలో బ్రాహ్మణిని కలిసిన ఐటి ఉద్యోగులు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట/ రాజమహేంద్రవరం ప్రతినిధి

ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలంలోని అనుమంచిపల్లి గ్రామం ఆంధ్ర, తెలంగాణ అంతరాష్ట్ర గరికపాడు చెక్ పోస్ట్ వద్ద శనివారం రాత్రి పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. డిసిపి రజిత ఆధ్వర్యంలో పోలీసులు భారీ ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోని ఐటి ఉద్యోగులు రాజమహేంద్రవరం కార్ల ర్యాలీకి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఆదివారం తెల్లవారుజాము నుండే హైదరాబాదు నుండి విజయవాడ వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎలాంటి నిరసనలు, ధర్నాలు, ర్యాలీలకు అనుమతి లేదని పోలీసులు తెలిపారు. హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలు విజయవాడ వైపు రాకుండా చెక్‌పోస్టు వద్ద నిలుపుదల చేశారు. ప్రతి వాహనాన్ని పరిశీలించి నిర్ధారనకు వచ్చిన తరువాతే వదిలారు.

విజనరీ లీడర్‌ను జైలులో పెట్టడం బాధాకరం : ఐటి ఉద్యోగులు

ఐటి ఉద్యోగులు పోలీసు నిర్భంధాన్ని దాటుకుని రాజమహేంద్రవరంలో ఉన్న నారా బ్రాహ్మణిని ఆదివారం కలిశారు. చంద్రబాబు అరెస్టు పూర్తిగా అక్రమమని, ఒక విజనరీ లీడర్‌ను జైలులో పెట్టడం బాధాకరమని అన్నారు. చంద్రబాబు అరెస్టు కక్ష పూరితమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో పని చేస్తున్న తాము రాజమహేంద్రవరం వస్తుంటే పోలీసులు అనేక ఆంక్షలు పెట్టి ఇబ్బందులు పెట్టారని తెలిపారు.

తమ ఫోన్లు కూడా పోలీసులు తీసుకున్నారని.... వాట్సాప్ చాటింగ్ కూడా చెక్ చేశారని, ఇక్కడ హోటల్‌లో దిగితే పోలీసులు వచ్చి తమను గదిలో ఉంచి తాళాలు వేశారని వాపోయారు. ఈ సందర్భంగా బ్రాహ్మణి మాట్లాడుతూ తమకు మద్దతు తెలిపేందుకు హైదరాబాద్ నుంచి వస్తున్న ఐటి ఉద్యోగులపై ఆంక్షలు విధించడం, బెదిరింపులకు పాల్పడడం దారుణమని అన్నారు. చంద్రబాబుకు సంఘీభావం తెలిపేందుకు ప్రభుత్వ నిర్భందాలను దాటుకుని వచ్చిన ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు. చంద్రబాబు ఈ కష్ట సమయాన్ని అధికమిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

5 వరకు చంద్రబాబు రిమాండ్

(మొదటి పేజీ తరువాయి)


పిటిషన్‌ను దాఖలు చేసింది. సిఐడి కస్టడీ పిటిషన్‌పై చంద్రబాబు నాయుడు లాయర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు.

రెండో రోజు విచారణ సాగిందిలా..

చంద్రబాబు రెండు రోజుల సిఐడి కస్టడీ ఆదివారం ఉదయం 9.30 గంటలకు మొదలై సాయంత్రం ఐదు గంటలకు ముగిసింది. ప్రతి గంటకు ఐదు నిమిషాల చొప్పున బ్రేక్ ఇచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంటకు లంచ్ బ్రేక్ ఇచ్చి రెండు గంటలకు తిరిగి విచారణ ప్రారంభించారు. రెండో రోజు కూడా సుమారు ఆరు గంటలకుపైగా చంద్రబాబును రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో సిఐడి విచారించింది. గడిచిన రెండ్రోజుల్లో సుమారు వందకుపైగా ప్రశ్నలు వేసినట్లు తెలుస్తోంది. విచారణ అనంతరం చంద్రబాబుకు అధికారులు వైద్య పరీక్షలు నిర్వహించారు. చంద్రబాబు విచారణను సిఐడి అధికారులు వీడియో తీయించారు. కేసు ఇన్వెస్టిగేషన్ అధికారి డిఎస్‌పి ధనుంజయుడు ఆధ్వర్యంలో రెండు బృందాలుగా విడిపోయి విచారణ చేశారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం... ఐఎఎస్ అధికారుల వాంగ్మూలాలని, డాక్యుమెంట్లను ముందుపెట్టి చంద్రబాబుని విచారించారు. షెల్ కంపెనీల ద్వారా నిధుల మళ్లింపుపై ప్రధానంగా విచారణ జరిగింది. చంద్రబాబు పిఎ పెండ్యాల శ్రీనివాస్‌కు హవాలా రూపంలో రూ.118 కోట్లు అందినట్లు ఉన్న ఆరోపణలపై ప్రశ్నలు వేశారు.

చంద్రబాబు 13 చోట్ల చేసిన సంతకాలపైనా అధికారులు ప్రశ్నించారు. ఆర్థిక శాఖ అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోకుండా రూ.371 కోట్లు నిధులు విడుదల ఎందుకు చేశారని, కిలారు రాజేష్‌కు, నారా లోకేష్‌కు మధ్య ఆర్థిక సంబంధాలపైనా ఆరా తీశారు. ఈ ప్రశ్నలకు కొన్నింటికి చంద్రబాబు సమాధానం చెప్పారు. మరికొన్నింటికి తనకు తెలియదని చెప్పినట్లు తెలిసింది. కస్టడీ అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎసిబి కోర్టులో హాజరు పర్చారు. చంద్రబాబు రెండో రోజు విచారణలో భాగంగా సెంట్రల్ జైలు చుట్టుపక్కల పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నారు.

ఎన్‌టిఆర్ ఘాట్ వద్ద మోత్కుపల్లి నిరసన దీక్ష



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్ట్ రాజ్యాంగ విరుద్ధమని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవహారంపై 2021లో కేసు నమోదైతే.. ఎఫ్ఐఆర్‌లో పేరు లేని వ్యక్తిని ఇప్పుడు అరెస్ట్ చేయించిన ఘనత ఎపి సిఎం జగన్‌దేనని విమర్శించారు. చంద్రబాబు అరెస్ట్‌ను ఖండిస్తూ ఆదివారం హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ ఘాట్ వద్ద మోత్కుపల్లి నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ జగన్ విధానాలను చూసి ప్రజలు నవ్వుతున్నారని చెప్పారు. వచ్చిన అధికారాన్ని కాపాడుకోలేని అసమర్థుడని విమర్శించారు. ప్రపంచవ్యాప్తంగా నియంత అనే పేరు జగన్ తెచ్చుకున్నారని అన్నారు. రానున్న రోజుల్లో నాలుగు సీట్లు కూడా వైసిపికి రావని తెలిపారు. సొంత చెల్లికి తండ్రి ఆస్తిలో కూడా భాగం ఇవ్వకుండా జగన్ బయటకు పంపాడని అన్నారు. జగన్ గెలుపు పాపంలో నాకూ భాగస్వామ్యం ఉందని బాధపడుతున్నానని చెప్పారు. ఆయన కళ్లకు అహంకార పొరలు కమ్ముకున్నాయి. సొంత బాబాయ్‌ని చంపిన నేరస్తుడిని పట్టుకోలేని జగన్ ఎలాంటి నాయకుడు? నేను జగన్‌కు వ్యతిరేకం కాదు.. ఆయన దుర్మార్గానికి వ్యతిరేకం అని మోత్కుపల్లి పేర్కొన్నారు.

అంగన్‌వాడీలపై నిర్బంధం తగదు

- వామపక్షాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకు సోమవారం విజయవాడలో చేపట్టిన మహాధర్నాకు తరలి వస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లపై పోలీసులు ఎక్కడికక్కడే నిర్భందాన్ని ప్రయోగిస్తూ అక్రమంగా అరెస్టులు చేయడాన్ని వామపక్షపార్టీలు తీవ్రంగా ఖండించాయి. ధర్నాను విఫలంచేయడానికి ప్రభుత్వం పోలీసుల ద్వారా నిర్భందాన్ని ప్రయోగించడం పట్ల సిపియం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, వై సాంబశివరావు (సిపిఐ(యంఎల్) న్యూడెమోక్రసి), జాస్తి కిషోర్‌బాబు (సిపిఐ(యంఎల్), కాటం నాగభూషణం (యంసిపిఐ(యు)), యన్ మూర్తి (సిపిఐ(యంఎల్) లిబరేషన్), చిట్టిపాటి వెంకటేశ్వర్లు (సిపిఐ(యంఎల్) న్యూడెమోక్రసి), బిఎస్ అమర్‌నాథ్ (యస్‌యుసిఐ(సి)), పివి సుందరరామరాజు(ఫార్వర్డ్‌బ్లాక్), జానకి రాములు (రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ)లు ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. ఇళ్ళవద్దనే అరెస్టు చేసి నిర్భంధించడం, వాహనాలను అడ్డుకోవడం, ధర్నాకు అనుమతినివ్వకపోవడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి పూనుకోకుండా నిర్బంధం ప్రయోగించడం దారుణమని అన్నారు. తమ న్యాయసమ్మతమైన కోర్కెలను ప్రభుత్వం దష్టికి తీసుకురావడం, నిరసన తెలపడం రాజ్యాంగం ఇచ్చిన హక్కు.అని ఆ హక్కును అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని హరించడమేనని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అరెస్టు చేసినవారిని తక్షణమే విడుదల చేసి, విజయవాడలో జరిగే మహాధర్నాకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మహాధర్నాకు అనుమతి నిరాకరించడం తగదు : కార్మిక సంఘాలు

రాష్ట్రంలోని అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం విజయవాడలో చేపట్టిన మహాధర్నాకు అనుమతిని నిరాకరించడం తగదని సిఐటియు, ఎఐటియుసి, ఐఫ్‌టియు రాష్ట్ర కమిటీలు పేర్కొన్నాయి. ఈ మేరకు ఆదివారం సిఐటియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి సిహెచ్ నర్సింగ్‌రావు, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె పొలారిలు ఒక ప్రకటన విడుదల చేశారు.అంగన్‌వాడీల ఉద్యమాన్ని పోలీసులతో అణిచివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. అంగన్‌వాడీల పోరాటాలకు తమ సంపూర్ణ మద్దతు వుంటుందని తెలిపారు.

ఐద్వా మద్దతు : డి రమాదేవి

రాష్ట్ర వ్యాప్తంగా తమ సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన పోరాటాలకు తమ సంపూర్ణ మద్దతు వుంటుందని ఐద్వా ప్రకటించింది. ఈ మేరకు ఐద్వా రాష్ట్ర ప్రధానకార్యదర్శి డి రమాదేవి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలపై నిర్బంధాలను ఆపి వారి సమస్యలను చర్చించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరంలో సాగుతున్న దళిత రక్షణ యాత్ర

ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - పశ్చిమ యంత్రాంగం

ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు డిమాండ్ చేశారు. కెవిపిఎస్, వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో జిల్లా పశ్చిమగోదావరి జిల్లాలో చేపట్టిన దళిత రక్షణ యాత్ర ఆదివారం గణపవరం, అత్తిలి, పెనుమంట్ర మండలాల్లో సాగింది. నత్తారామేశ్వరంలో యాత్రకు ఘన స్వాగతం పలికారు. అనంతరం బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద జరిగిన సభలో క్రాంతిబాబు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాలరాస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టి దేశ సంపదను దోచిపెడుతున్నారని విమర్శించారు. ప్రయివేటుపరం చేసే అన్ని సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గణపవరంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడారు. వీరవాసరం మండల కేంద్రంలోని పెదపేటలోని అంబేద్కర్ విగ్రహానికి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుత్తిగా నరసింహమూర్తి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గణపవరం, సరిపల్లి, పిప్పర దళితపేటల్లో యాత్రసాగింది.

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం కెటవరంలో మరో యాత్ర ఆదివారం ప్రారంభమైంది. పేరంపేట, నాగులుగూడెం గ్రామాల్లోని దళితపేటల్లో కరపత్రాలు పంపిణీ చేస్తూ యాత్ర సాగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శివనాగరాణి, జిల్లా అధ్యక్షులు ఎం జీవరత్నం మాట్లాడుతూ దేశంలో దళిత హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని అన్నారు. ఏళ్ల తరబడి సామాజిక న్యాయం కోసం రెడ్డెక్కుతున్నా న్యాయం జరగడంలేదని అసహనం వ్యక్తం చేశారు. దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని తెలిపారు. దళితుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుందరయ్య, వేదికపై నాగేశ్వరరావు, దొర

ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

- కాల్ ఆన్, అద్దె బస్సుల డ్రైవర్లకు కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ అమల్జేయాలి
- ఆర్‌టిసి యాజమాన్యమే బాధ్యత వహించాలి
- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్ ఆర్‌టిసిలోని ఔట్ సోర్సింగ్ కార్మికులు, కాల్ ఆన్ డ్రైవర్లు, అద్దె బస్సుల కార్మికులు, ఇతర సిబ్బంది సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం విజయవాడలో ఆర్‌టిసి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కాల్ ఆన్‌డ్రైవర్లు, అద్దె బస్సుల కార్మికుల రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎవి నాగేశ్వరరావు, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ సుందరయ్యతో కలిసి మాట్లాడారు. అద్దె బస్సు, ఔట్ సోర్సింగ్ డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వ జిఓలు ఏవి అమలు కావడంలేదన్నారు. వీరికి ఇఎస్ఐ, పిఎఫ్, కనీస వేతనాలను అమల్జేయాల్సిన బాధ్యత ఆర్‌టిసి యజమాన్యానిదేనని తెలిపారు. కనీసం ఆర్‌టిసి హాస్పిటల్స్‌లో నైనా వైద్య సేవలను అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. యాజమాన్యం ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించకపోతే పోరాటాలే మార్గమన్నారు. ఉద్యోగ సంఘాలు కూడా తోడ్పాటు అందించాలని కోరారు. అసంఘటిత రంగ కార్మికులకు రూ.20 వేలు, సెమీ స్కిల్డ్ వర్కర్లకు రూ.25 వేలు, స్కిల్డ్ వర్కర్లకు రూ.30 వేలు వేతనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్, గ్రాట్యుటీ, మెటర్నటీ సెలవులు, పండుగ సెలవులను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమంలో భాగంగా తొలుత సంతకాల సేకరణ చేపట్టాలని, అక్టోబర్‌లో విజయవాడలోని ధర్నా చౌక్‌వద్ద ఆందోళనా కార్యక్రమాలను చేపట్టాని సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ సత్యనారాయణ కన్వీనర్‌గా మరో 8 మందితో కమిటీ ఎన్నికైంది. ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి దొర, నాయకులు శాస్త్రులు, సాంబశివరావు, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

టిడిపి పొలిటికల్ యాక్షన్ కమిటీ నియామకం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడిపి పొలిటికల్ యాక్షన్ కమిటీని ఆ పార్టీ ఏర్పాటు చేసింది. పార్టీ రాజకీయ కార్యక్రమాల పర్యవేక్షణ కోసం నియమిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సభ్యులుగా యనమల రామకృష్ణుడు, కింజరాపు అచ్చెన్నాయుడు, చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎంఎ షరీఫ్, పయ్యావుల కేశవ్, నందమూరి బాలకృష్ణ, నిమ్మల రామానాయుడు, నక్కా ఆనంద్‌బాబు, కాలువ శ్రీనివాసులు, కొల్లు రవీంద్ర, బిసి జనార్ధన రెడ్డి, వంగలపూడి అనిత, బీద రవిచంద్రయాదవ్, నారా లోకేష్‌లతో కమిటీ ఏర్పాటు అయింది. టిడిపి అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ కమిటీ నియమించిన్నట్లు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

చలో కలెక్టరేట్ విజయవంతం చేయండి: ఫోర్టో

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జిపిఎస్‌కు వ్యతిరేకంగా ఫ్యాప్టో-ఎపిసిపిఎస్ఈఎ నిర్వహించనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎపిసిపిఎస్ ఉపాధ్యాములకు ఫోర్టో పిలుపునిచ్చింది. ఆన్‌లైన్‌లో ఆదివారం ఫోర్టో రాష్ట్ర కార్యవర్గ నిర్వహించి చలో కలెక్టరేట్ కు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా ఫోర్టో నాయకులు మాట్లాడుతూ సిసిఎస్ రద్దు చేస్తామని చెప్పినవారు మాట తప్పారని పేర్కొన్నారు. జిపిఎస్ పేరిట మెడ మీద కత్తి పెట్టడం సరికాదన్నారు. జిపిఎస్ ఉపసంహరించుకొని ఓపిఎస్ నిదానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఫోర్టో చైర్మన్ కరుణం హరికృష్ణ, సెక్రటరీ జనరల్ అంకాల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

నోబుల్ టీచర్స్ మద్దతు

జిపిఎస్ రద్దు కోసం చలో కలెక్టరేట్ ఉద్యమానికి నోబుల్ టీచర్స్ మద్దతు తెలిపింది. జిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునర్ధరించాలని అధ్యక్షులు మూకల అప్పారావు, ప్రధాన కార్యదర్శి నడిపినేని వెంకట్రావు డిమాండ్ చేశారు.

ప్రజలకు చేరువగా పథకాలు

- కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ

ప్రజాశక్తి - సీతమ్మధార (విశాఖపట్నం)

కేంద్ర ప్రభుత్వం అందిస్తోన్న సంక్షేమ పథకాలను సోషల్ మీడియా వలంటీర్లు ప్రజలకు చేరువ చేయాలని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ అన్నారు. విశాఖలో బిజెపి సోషల్ మీడియా వలంటీర్ల సమావేశంలో ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రధాని మోడీ అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు.

తీరంలో మరో కుంపటి

- నక్కపల్లికి బల్క్‌డ్రగ్ పార్క్‌ను తరలిస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం
- కాలుష్య భయంతో స్థానికుల ఆందోళన
- 'హెటిరో' రెండో పైప్‌లైన్‌కు వ్యతిరేకంగా ఇప్పటికే కొనసాగుతున్న పోరాటం



ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

ప్రజా ప్రతిఘటనతో కాకినాడ సెజ్‌లో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుపై ప్రభుత్వం వెనక్కి తగ్గింది. అయితే, దీనిని పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సొంత జిల్లా అనకాపల్లిలోని నక్కపల్లి మండలంలో ఏర్పాటు చేయాలని బుధవారం రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. దీంతో, ఈ ప్రాంత ప్రజల్లో కలవరం ప్రారంభమైంది. నక్కపల్లి హెటిరో డ్రగ్ కంపెనీ సముద్రంలోకి విడిచిపెడుతున్న వ్యర్థాలతో మత్స్య సంపద గణనీయంగా తగ్గడంతో జీవనోపాధి దెబ్బతిన్న రాజయ్యపేట, బోయపాడు, పెదతీనార్ల, చినతీనార్ల, దొండవాక, అమలాపురం, డిఎల్‌పురం, బంగారయ్యపేట గ్రామాల మత్స్యకారులు హెటిరో రెండో పైప్‌లైన్‌కు వ్యతిరేకంగా సుదీర్ఘ కాలంగా పోరాడుతున్నారు. కంపెనీకి ఆనుకొని ఉన్న అయ్యన్నపాలెం, నల్లమట్టిపాలెం, బుచ్చిరాజుపేట, ఎన్.నర్సాపురం, చందనాడ, జానకయ్యపేట, సిహెచ్ఎల్.పురం ప్రజలు కాలుష్య ప్రభావానికి గురవుతున్నారు. మత్స్యకారుల, స్థానిక ప్రజల బాధలు ప్రభుత్వం పట్టించుకోకుండా ఈ ప్రాంతంలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు నిర్ణయం తీసుకోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రస్తుత కాకినాడ జిల్లా తొండంగి మండలం కెపి పురం, కోదాడ మధ్య బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు కోసం 2020 అక్టోబర్ 15న కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. రెండు వేల ఎకరాల్లో ఈ పార్కు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. దీంతో, తమ ప్రాంతం కాలుష్య కోరల్లో చిక్కుకుంటుందంటూ అప్పటి నుంచి ఆ ప్రాంత ప్రజలు వ్యతిరేకిస్తూ వచ్చారు. ఈ ఏడాది జూన్ ఆరున జరిగిన ప్రజాభిప్రాయసేకరణలో మత్స్యకారులు, రైతులు, స్థానిక ప్రజలు బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకించారు. కేంద్ర, రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖకు, జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి)కు, కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేశారు. విశాఖ-చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా నక్కపల్లి పారిశ్రామిక క్లస్టర్ కోసం 4,500 ఎకరాలను ఎపిఐఐసి ద్వారా ప్రభుత్వం సేకరించింది. కాకినాడ సెజ్‌లో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు పరిస్థితులు ప్రతికూలంగా ఉండడంతో ఈ పార్కును ఈ నక్కపల్లిలోని ఈ భూముల్లో ఏర్పాటుకు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, చందనాడ, వేంపాడు, డిఎల్‌పురంలో రైతులకు, వృత్తిదారులకు, కార్మికులకు పూర్తి స్థాయిలో పరిహారం, ప్యాకేజీ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో బల్క్ డ్రగ్ పార్క్‌ను నక్కపల్లికి తరలిస్తామన్న మంత్రివర్గ నిర్ణయంతో పుండుమీద కారం జల్లినట్లయింది. తీరప్రాంతంలోని పాయకరావుపేట మండలం కేశవరం డెక్కన్ ఫైన్ కెమికల్స్, నక్కపల్లి హెటిరో డ్రగ్స్, పరవాడ, అచ్యుతాపురం సెజ్‌లో ఫార్మా కంపెనీలు సముద్రంలోకి విడిచిపెడుతున్న వ్యర్థాలతో మత్స్య సంపద తగ్గుతోంది. వాయు, జల కాలుష్యంతో పరిసర ప్రాంత ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. కాలుష్య పరిశ్రమల ముప్పు నుంచి రక్షించాలని ఆయా ప్రాంత ప్రజల డిమాండ్‌గా ఉంది. దీనిని పట్టించుకోకుండా మరో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. బల్క్ డ్రగ్ పరిశ్రమల్లో కాలుష్యం విడుదల ఎక్కువగా ఉంటుందని, పర్యావరణానికి మరింత హాని కలుగుతుందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఉపసంహరించుకోవాలి



నక్కపల్లి ప్రాంతంలో బల్క్ డ్రగ్ పార్కును ఏర్పాటు చేయాలన్న మంత్రివర్గ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. హెటిరో, డెక్కన్ కెమికల్స్ వంటి కంపెనీల కాలుష్యంతో ఈ ప్రాంత ప్రజలు ఇప్పటికే తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతింది. పంటల దిగుబడులు తగ్గుతున్నాయి. భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. కాలుష్య కారక పరిశ్రమలు నెలకొల్పేందుకు ఏర్పాటు చేసే బల్క్ డ్రగ్ పార్కును తక్షణమే ఉపసంహరించుకోవాలి. లేకపోతే ప్రజా ఉద్యమాలతోపాటు న్యాయ పోరాటాలతో అడ్డుకుంటాం. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కాలుష్య రహిత పరిశ్రమలు ఏర్పాటుచేసి, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలి.

ఎం.అప్పలరాజు, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

నేతన్న సమస్యలపై 'పోలా'ది అలుపెరగని పోరాటం

- సంస్మరణ సభలో పలువురు వక్తలు



సంస్మరణ సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

చేనేత కార్మిక, ప్రజా సమస్యలపై పోలా రామాంజనేయులు అలుపెరుగని పోరాటాలు చేశారని పలువురు వక్తలు అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలా రామాంజనేయులు సంస్మరణ సభ ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సిపిఎం రాష్ట్ర నాయకులు ఓబులు, రాంభూపాల్, ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు. తొలుత రామాంజనేయులు చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రామాంజనేయులు చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేశారని తెలిపారు. చేనేతల సమస్యలపై పోరాడుతూ జైలుకు కూడా వెళ్లారన్నారు. పోలా రామాంజనేయులు మృతి చేనేత కార్మిక లోకానికి తీరని లోటని అన్నారు. ఆయన ఉద్యమ స్ఫూర్తిని, ఆశయాలను కొనసాగిద్దామని కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకా చలపతి, సిపిఎం, సిపిఐ, జెవివి, యుటిఎఫ్, రైతుసంఘం నాయకులు పాల్గొన్నారు. రామాంజనేయులు చిత్రపటానికి జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన ఉద్యమ స్ఫూర్తిని కొనియాడారు.



న్యాయస్థానాల నూతన భవనాలను ప్రారంభిస్తున్న ధీరజ్ సింగ్ ఠాకూర్

దిగువ న్యాయస్థానాల్లో వచ్చే తీర్పులు కీలకం

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

ప్రజాశక్తి - లీగల్ రిపోర్టర్ (విశాఖపట్నం)

దిగువ న్యాయస్థానాల్లో వచ్చే తీర్పులు ఉన్నత న్యాయస్థానాలకు ఒక నిఘంటువుగా ఉంటాయని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ అన్నారు. విశాఖలోని జిల్లా న్యాయస్థానం ప్రాంగణంలో నిర్మించిన పది న్యాయస్థానాల నూతన భవనాలను ఆదివారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు, న్యాయమూర్తుల మధ్య భావ సుహృద్భావ వాతావరణం వల్ల ఉన్నతమైన తీర్పులు సాధ్యమవుతాయని తెలిపారు. న్యాయవాదులంతా మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా మెలగాలన్నారు. కాగితం లేని సాఫ్ట్‌వేర్ వాదనలతో తీర్పులు వెలువడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తాజాగా ప్రారంభించిన న్యాయస్థానాల భవనాలను దేవాలయాలుగా అభివర్ణించారు. ప్రస్తుతం విశాఖలో 71 న్యాయస్థానాలు ఉన్నాయని, వాటిలో 29 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. నూతనంగా నిర్మించిన న్యాయస్థానాలకు 15 వేలు కేసులను బదిలీ చేయనున్నట్లు చెప్పారు. నిజమైన బాధితులకు సేవలు అందించడమే న్యాయవాది అంతిమ లక్ష్యమని గుర్తు చేశారు. జస్టిస్ చీకటి మానవేందర్ రాయ్ మాట్లాడుతూ విశాఖ నగరంలో న్యాయస్థానాలు 50కి పైగా ఉన్నప్పటికీ మౌలిక వసతుల లేమితో ఇన్నాళ్లు ఇబ్బందులు ఉండేవని, ఇప్పుడు కొంత వరకూ తొలగనున్నాయని చెప్పారు. ఈ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో జస్టిస్ డివిఎస్.సోమయాజులు, జస్టిస్ చీమలపాటి రవి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలిపాటి గిరిధర్, న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చింతపల్లి రాంబాబు, పైలా శ్రీనివాసరావు, బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ కె.రామజోగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అంగళ్ల కేసులో టిడిపి కార్యకర్తలు విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్ (వైఎస్ఆర్ జిల్లా)

అన్నమయ్య జిల్లాలో చంద్రబాబు పర్యటన సందర్భంగా చోటు చేసుకున్న పుంగనూరు, అంగళ్ల అల్లర్ల కేసులో అరెస్టయిన 52 మందికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో వారు ఆదివారం కడప సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు. 60 రోజుల పాటు జైలు శిక్షణ అనుభవించారు. జైలు నుంచి విడుదలైన వారికి టిడిపి జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాధవిరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, షాజహన్‌బాష స్వాగతం పలికారు.

ఉక్కు పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు

కొనసాగిన ఉక్కు రక్షణ బైక్ యాత్ర



పార్వతీపురంలో సాగుతున్న బైక్‌యాత్ర

ప్రజాశక్తి-యంత్రాంగం

రాష్ట్రాభివృద్ధిలో భాగమైన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటు కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోన్న ప్రధాని మోడీని ప్రజలు నిలదీయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం సిపిఎం చేపట్టిన ఉక్కు రక్షణ బైక్ యాత్ర ఆదివారం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రానికి చేరుకుంది. కురుపాంలో ప్రారంభమైన ర్యాలీ పార్వతీపురం, సాలూరు మీదుగా బొబ్బిలి వరకు సాగింది. సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లె వెంకటరమణ అధ్యక్షతన పార్వతీపురం ఆర్‌టిసి కాంప్లెక్స్ జంక్షన్‌లో జరిగిన సభలో లోకనాథం మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో కీలకంగా వ్యవహరిస్తున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రక్షిస్తేనే రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోగలమని తెలిపారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు మొక్కుబడిగా పోరాటంలో పాల్గొంటూ ప్రజాప్రయోజనాలను గాలికి వదిలి, మోడీకి కొమ్ముకాస్తున్నాయని విమర్శించారు. వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు తమలో తాము కలహించుకోవడమే తప్ప బిజెపిపై నోరెత్తకపోవడం సరికాదన్నారు. విశాఖ స్టీలు ప్లాంట్ ప్రజల రెక్కల కష్టమని అన్నారు. విశాఖ ఉక్కు కోసం దీర్ఘకాలంగా కార్మికులు, ప్రజాసంఘాలు చేస్తున్న పోరాటాలను గుర్తించి బిజెపి ప్రభుత్వం వెనక్కి తగ్గాలని, లేనిపక్షంలో ఎటువంటి పోరాటానికైనా ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు బిజెపి దుర్మార్గ నిర్ణయాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకించి ఐక్య పోరాటాలు సాగించాలని కోరారు. బిజెపి తమ నిర్ణయాన్ని మార్చుకునే వరకూ పోరాటం కొనసాగిస్తామని, ప్రజలు తమతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, విశాఖ నాయకులు జగన్, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు రక్షణ యాత్రకు మద్దతుగా బైకు ర్యాలీలు

ఉత్తరాంధ్రలో సాగుతున్న విశాఖ ఉక్కు రక్షణ బైకు యాత్రకు మద్దతుగా విశాఖలోని గాజువాక నియోజకవర్గంలో ఆదివారం పలుచోట్ల బైకు ర్యాలీలు నిర్వహించారు. ఉక్కు నగరంలో సాగిన బైకు ర్యాలీని ఉద్దేశించి సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడారు. స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు తమ కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కూర్మన్నపాలెం వద్ద ప్రారంభమైన బైకు ర్యాలీని నాయకులు కృష్ణారావు, వడ్లపూడిలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ ప్రారంభించారు. పెదగంట్యాడలో సిపిఎం సీనియర్ నాయకులు ఎన్.రామారావు, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి రామస్వామి మాట్లాడారు. బైకు ర్యాలీలతో ఉక్కు నిర్వాసిత కాలనీల్లో 'సేవ్ వైజాగ్ స్టీల్' నినాదం మార్మోగింది.



మీడియాతో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు

కేసులకు భయపడం : నాగబాబు

ప్రజాశక్తి- తిరుపతి

అధికార పార్టీ పెట్టే అక్రమ కేసులకు జనసేన భయపడదని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు అన్నారు. తిరుపతిలో ఆదివారం జరిగిన ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రియాశీలక కార్యకర్తల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో రాయలసీమ జిల్లాల్లో పర్యటించిన సందర్భంలో చిత్తూరు, కడప జిల్లాల్లో పర్యటించలేదని, అందుకే తమ పార్టీ నాయకుల్లో ఆత్మస్థైర్యం నింపి, క్షేత్ర స్థాయిలో జరిగే అనేక అంశాలపై అందరితో మాట్లాడేందుకు వచ్చానని తెలిపారు. చిన్నచిన్న కార్యక్రమాలు చేసినా జనసైనికులపై కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అక్రమ కేసులకు భయపడమని హెచ్చరించారు. చంద్రబాబుని జైల్లో పెట్టిన సందర్భంలో ఆయన్ని కలిసి భవిష్యత్తులో టిడిపి, జనసేన కలిసి పోటీ చేయడానికి తమ పార్టీ అధ్యక్షులు నిర్ణయం తీసుకున్నారన్నారు. ఎవరు సిఎం అవ్వాలనే దానికంటే ముందు ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. జనసేనలో నాయకత్వ లోపంలేదని, జనసైనికులంతా నాయకులేనని అన్నారు. పవన్ కల్యాణ్‌ను ఎవరైనా ప్యాకేజ్ స్టార్ అంటే చెప్పుతో కొడతామని హెచ్చరించారు. డాక్టర్ హరిప్రసాద్ లాంటి నాయకులు చిత్తూరు జిల్లాకు చాలని, భూ ఆక్రమణలు చేసిన వాళ్లు, వందల కోట్లు దోచుకున్న వారు తమకు అవసరం లేదన్నారు. రాయలసీమలో చాలా బలంగా వారాహి యాత్ర నిర్వహించనున్నామని తెలిపారు. జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్ కుమార్, ఆస్ట్రేలియా కో ఆర్డినేటర్ కలికొండ శశిధర్, నేతలు కిరణ్ రాయల్, రాజారెడ్డి, కీర్తన పాల్గొన్నారు.

కాలవ శ్రీనివాసులు నిరాహార దీక్ష భగ్నం, అరెస్ట్

ప్రజాశక్తి - రాయదుర్గం



కాలవ శ్రీనివాసులును అరెస్టు చేస్తున్న పోలీసులు

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును విడుదల చేయాలని కోరుతూ ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అనంతపురం జిల్లా రాయదుర్గంలో చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేశారు. శనివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఎన్‌టిఆర్ సర్కిల్లో గల ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిబిరం వద్ద స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో పోలీసులు అక్కడికి చేరుకొని ఆమరణ నిరాహార దీక్షకు అనుమతి లేదని, దీక్షను విరమించాలని శ్రీనివాసులుకు చెప్పారు. తమ నాయకుడిని విడుదల చేసే వరకు తన దీక్ష కొనసాగిస్తామని ఆయన చెప్పడంతో బలవంతంగా శ్రీనివాసులును పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున అడ్డుకొని నినాదాలు చేశారు. భారీ పోలీసు బలగాలతో శ్రీనివాసులును ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రజాదరణను ఓర్వలేకనే తప్పుడు కేసు : పరిటాల సునీత

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు బస్సు యాత్ర, ఆయన తనయుడు నారా లోకేష్ పాదయాత్రల పట్ల ప్రజల్లో లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా తమ చంద్రబాబును అరెస్టు చేసిందని మాజీ మంత్రి పరిటాల సునీత ఆరోపించారు. రాయదుర్గంలో కాలవ శ్రీనివాసులును పరామర్శించేందుకు వచ్చిన సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. చంద్రబాబును అరెస్టు చేసి 13 రోజులు కావొస్తుందని, ఆయనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



విమర్శకుడు మూడు రకాల బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది.
1. రచయితకు కొన్ని సందర్భాల్లో దారి చూపించాలి. 2. కొన్ని సందర్భాల్లో రచయిత పక్కన నడవాలి. 3. కొన్ని సందర్భాల్లో రచయిత వెనుక నడవాలి.
- వల్లంపాటి వెంకట సుబ్బయ్య
మార్క్సిస్టు విమర్శకుడు, రచయిత



గగన అర్ధాంగి

నిన్ను ఆకాశమంత
ఎత్తేస్తున్నారని
సంబర పడిపోకోయ్!
కాసింత భూమ్మీద స్వేచ్ఛగా
నడవనివ్వమని
ఏకరువు పెడుతూనే వుంటిరీ

ప్రాతినిధ్య శాతాల లెక్కల పద్దుల్ని
తెరపైకి తెచ్చేసి
చప్పట్లు చరుచుకుంటున్నరు చూడు

ఆకలి గొన్న కాడ
నూకలు చల్లడం
మహా క్రూర ఎత్తుగడ సుమా!
మాన, ప్రాణ భద్రతల్ని వొదిలి
విలువల వలువలూడ్చి
కళ్ళప్పగించే వీళ్లంతా
ఎప్పుడో ఇంకెప్పుడో
బ్రహ్మరథం పట్టేస్తామనీ
కళ్లముందే కళ్లుగప్పి
మీ అతివలందరికీ
మంగళ హారతి
ఇస్తున్నారు చూడు

ఏ నినాదం వెనుక
ఏ లబ్ధి దాగుందో గమనించండీ
మోసపోవడం
ఆనవాయితీ అనుకొని
గాల్లో గోపురాలు కట్టెయ్యకండే...
మీ నక్క జిత్తులు
పసిగడితే మాత్రం
వాళ్లంతా అదే వాళ్లంతా
ఎర్రబడే గగనానికి
అర్ధాంగులే...!

– డాక్టర్ కటుకోర్యుల రమేష్
9949083327



పల్లె ఇప్పుడు ...


ఆధునికీకరణ చాకిరేవు బండ మీద
పల్లె పాదుల్లో పొదిగిన వృత్తులను
పాలకులు ఉతకెయ్య లేదు, చితకేశారు
అక్కడ ఉరితీయబడిన వృత్తులు
పట్టణ రాట్నపు రెక్కల్లో కూలెత్తుతున్నాయి

విత్తనంపై రైతు పెత్తనం తప్పించి
కార్పొరేట్ల గుత్త హక్కుగ కట్టబెట్టాక
ఎరువుల ధరలకు బరువులు ఎత్తి
రైతు బతుకు బరువెక్కించాక
వ్యవసాయం ఎగసాయమైంది
నాగటి కర్రు నేల చాలులో సమాధైంది
మార్కెట్లలోకి దూరిన కార్పొరేట్ల కత్తి
ధరల మెడపై వేలాడి ఉసురు తీసింది

పట్నమిపుడు పల్లె యాసబాసల
నవ యవ్వనం నింపుకుంటుంటే
పల్లె ఊతకర్రలా మారిన ముల్లుగర్రయి
పొలంవైపు దిగులు చూపులు చూస్తోంది
పచ్చదనం మొలకెత్తక బీడైన పొలంపై
రైతు కళ్ళ జాలి చూపుల గాలి వీస్తోంది

సంక్రాంతికి దుమ్మురేపుకుంటూ
కార్లలో రయ్ రయ్‌మని వాలే
పట్టణ పక్షులు అతిథులై వాలేప్పుడే
పల్లె తొర్రి పళ్ళతో నవ్వుతోంది
పల్లిప్పుడు సప్త వర్ణాల హరివిల్లు కాదు
ఆకాశపు ఎడారి గుర్తుల తడి లేని మడుగు
ఎప్పుడే ఊపిరి రద్దుపద్దులో పడుతుందో తెలీని
వృద్ధ దేహాల ఊతకర్ర అడుగుల ఊరేగింపు

– ఉన్నం వెంకటేశ్వర్లు



భవిష్యత్‌లో ఒక రోజు

అంతరిక్ష ప్రయాణికులారా ...
అంతా శ్రద్ధగా వినండి
భారత్ నుంచి పల్లె వెలుగు బస్సు
జాబిల్లిని చేరబోతుంది
ఒకళ్ల నొకళ్లు తోసుకోక
మెల్లగా దిగండి
మీ మూటా ముల్లె మరిచిపోక
మీతోనే తీసుకువెళ్ళాలండి
జేబుదొంగలుంటారు సుమా!
జాగ్రత్తగా మెలగండి
ఫలహారాలు చేసినా
పరిసరాలు చూడండి
చిరుతిళ్లు, రేపర్లు
చెల్లాచెదురుగా పడవేయకండి
ముచ్చటైన చందమామ
మచ్చ పెరగనీకండి
చీకటి పడేలోగా...
అదే, అమావాస్య వచ్చేలోగా..
అందరూ బస్సు వద్దకు చేరండి
సెల్ఫీల తలపులోన
దారి మర్చిపోకండి
మార్స్ వైపు పోకండి
బస్సు వద్దకు చేరండి!

– డా. డి.వి.జి.శంకర రావు,
మాజీ ఎంపీ,
94408 36931

కుల మత వివక్షలపై పోరాడిన కలం వీరుడు

సందర్భం



సమాజంలోని అవకతవకలను, హెచ్చుతగ్గులను సరి చేయటానికి మనుషుల మధ్య ఉన్న సామాజిక అంతరాలను తొలగించి సమానత్వం నెలకొల్పటానికి అక్షరాన్ని ఆయుధంగా మలుచుకున్న కలం వీరుడు గుర్రం జాషువా. 20వ శతాబ్దం ప్రారంభం నుంచి నేటి వరకు తెలుగు కవిత్వం అనేక విధాలైన మార్పులు చెందింది. 1930 నుంచి 70 దాకా ఈ మార్పుల్లో ఈ వేగం పంచుకోవడమే కాకుండా సాహిత్య గమనాన్ని మార్చేసింది. అంతవరకు కవితా వస్తువుగా ఉన్న దేవుళ్ళు, దేవతలు, మునులు, మహర్షులకు బదులుగా శ్రమజీవి (ఊరి వెలుపల జీవిస్తున్న) మనిషిని కవితా వస్తువుగా మలిచేటటువంటి అద్భుతమైన ప్రక్రియ మొదలైంది. మనిషి తనతోటి మనిషి గురించి ఆలోచించే అరుదైన ప్రక్రియ మొదలైంది. మనుషులందరూ సమానమైన సాంఘిక హోదా కలిగి ఉండాలని సమానత్వానికి అవరోధమైనటువంటి ఆధ్యాత్మిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక దోపిడీల నుంచి సమాజం విముక్తి కావాలని దేవుళ్లపైనే ప్రశ్నలు సంధించాడు జాషువా.

"ముసలివాడైన బ్రహ్మకు పుట్టినారు
నలుగురు కుమారులనుట విన్నాము గానీ
పసరము కన్న హీనుడ భాగ్యుడైన
ఐదవ కులస్తుడు ఎవడమ్మా సవిత్రీ" అంటూ ప్రశ్నించాడు. ఈ దేశంలో పుట్టిన ప్రతి శిశువు ఏదో ఒక కుల గుంపులో భాగమైపోతున్నాడే తప్ప మనిషిగా వికసించలేక పోవడాన్ని ఆయన ఏవగించుకున్నాడు. వ్యక్తి వికాసానికి సమాజ పురోగమనానికి తమ వంతు పాత్ర నిర్వహించాల్సిన కవులు, కళాకారులు, రచయితలు కూడా మతపరమైన మత్తులో మునిగిపోవడాన్ని ఆయన ఖండించాడు.

"ఏనాడు మా కావ్య సృష్టికర్తల జిహ్వ
విశ్వసంత్యమును నాలపింపగలదో
ఏనాడు మా జాతి దృష్టి మాధ్యమువాసి
చుట్టుప్రక్కల తేరి చూడగలదో
ఏనాడు మా బుర్ర లీజుట్టు
తల లేని పుక్కిట కథలలో జిక్కువడవో
ఏనాడు మా విద్యలినుప సంఘంబు నందు
చిలుము పట్టక ప్రకాశింపగలవో" అంటూ తన ఆవేదన వ్యక్తం చేశాడు.

మత మూఢత్వం సృష్టించిన మూఢ నమ్మకాలు తనను, తన జాతి ప్రజలను సమాజానికి దూరం చేసినా తనలో ఏ మాత్రం దేశభక్తి తగ్గలేదు అనటానికి నిదర్శనం భరతమాత ఖండకావ్యం. సాంప్రదాయ భావ దారిద్ర్య లోపంతో తనపై అసూయ ద్వేషాలతో రగిలిపోతూ తనను తక్కువ చేసి చూస్తున్నటువంటి పండిత సమాజానికి తన కవితా జరితో దీటుగా ఎదుర్కొన్నాడు జాషువా.

"గవ్వకు చాటి రాని పలుగాకుల మూకలు నెవ్విధ్దిన్ దూరినన్ నన్ వలచిన శారదలేచిపోవునే" అంటూ సమాధానమిచ్చాడు. అంతకు ముందు సాంప్రదాయ సాహిత్యంలో దూరమైన పల్లెపదాలు సామాజిక చైతన్యాన్ని, వస్తువును, శిల్పాన్ని తన కవిత్వంలోకి ఒంపుకుని నిరక్షరాశులకు కూడా సాహిత్యాన్ని దగ్గర చేశాడు. ఉదాహరణకు శ్మశానవాటిక (సత్య హరిచంద్ర) పద్యాలు ...

"వాకొనరాని గొప్ప ధనవంతుని నిర్దపు పాలరాతి
గోరీకడ పారవేయబడి పేలికలన్ పొరలాడు ప్రేతమే
ఆకటి చిచ్చునన్ కుమిలి యార్చి గతించిన పేదవాని దౌ
నోకద వానికై వగవడొక్కడు దాచడు కాటినేలయున్"

అంటూ తన కావ్య నాయకుడైన పేదవాడి జీవితాన్ని వర్ణించాడు.

జాషువా స్త్రీవాద సాహిత్యాన్ని కూడా అద్భుతంగా రాశాడు. 'వంచిత' అనే కండకావ్యంలో స్త్రీల దుర్భర స్థితిని ఎలుగెత్తి చాటాడు. పురుషులు స్త్రీని వంటింటి కుందేలుగా మార్చి సంతానోత్పత్తి కలిగించే యంత్రాలుగా పూజగదులకు, పడకగదులకు మాత్రమే పరిమితం చేయడాన్ని ఆయన వ్యతిరేకించాడు. తన ఇంట్లోని స్త్రీలను పరదాల ముసుగుల్లో దాచిపెట్టి వీధుల్లో స్త్రీలకు స్వేచ్ఛ కావాలంటూ రోడ్లు ఎక్కుతున్న సమాజం ఇది అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించాడు

"అబలయన్న బిరుదమంటించి కాంతల
స్వీయశక్తులదిమి చిదిమినారు
సబలయన్న బిరుదు సాధించి హక్కులు
గడన చేసుకొమ్ము కష్ట చరిత్ర" అని రాశాడు.

"బిరుదు అంటించడం" అనడం లోకం తీరుకు నిదర్శనం. స్త్రీ అందానికి నిర్వచనమైన చోట స్త్రీలోని అమ్మతనాన్ని 'అనాథ' ఖండకావ్యంలో అద్భుతంగా వర్ణించాడు జాషువా. పాలకవర్గాల ఆశ్రయించి వారిచ్చే బహుమానాలుతో పబ్బం గడుపుకునే వారిని పొగుడుతూ, కీర్తిస్తూ కావ్యాలు రాసే కవులు గురించే కాక పాలకవర్గం చేత దోపిడీకి గురికాబడిన కవి గురించి 'పిరదౌసి' ఖండకావ్యం రచించాడు.

జాషువా గొప్ప దేశభక్తుడు, జాతీయవాది, భారతదేశ చరిత్ర సంస్కృతుల మీద అపారమైన గౌరవం కలవాడు. బుద్ధుడు, భరతమాత, వివేకానంద, అఖండ గౌతమి వంటి రచనలు ఆయన దేశభక్తికి నిదర్శనాలు. గిజిగాడు, సాలీడు వంటి ఖండకావ్యాలు ఆయన గొప్ప ప్రకతి ప్రేమికుడు అనడానికి నిదర్శనం. సఖి, జేబున్నిసా వంటి ప్రణయ కవితలు, పంచముడు, ధర్మ కిరీటం, గుసగుసలు, ఇంటిగుట్టు వంటి సంఘ సంస్కరణ కావ్యాలు ఆయన కలం నుంచి జాలువారినవి. ఆయన సృష్టించిన గబ్బిలం ఖండకావ్యం ఖండాతరాల కీర్తిగాంచింది.

సాధారణంగా కవులు తమ వంశాల గురించి తమ సామాజిక వర్గాల గురించి గొప్పగా చిత్రించుకుంటారు కానీ, జాషువా తన ప్రజల్లో ఉన్నటువంటి బలహీనతలను కూడా బహిరంగంగా ఒప్పుకున్నాడు. తన జాతి మధ్య ఉన్నటువంటి అసమానతలు విస్పష్టంగా ఖండించాడు.

"కలదమ్మ అంటరానితన మాకరుణింపుమీ యిండియా
పొలమందు గల మాల మాదిగలకున్ బూతేశుడే కాదు
కృష్ణులు కృష్ణున్నిరసించు దైవములు క్రీస్తుల్ మస్తుగా
బుట్టినన్
కలుపన్నేరరు రెండుజాతులను వక్కాణింప సిగ్గయ్యెడిన్"

కవులు రచయితలు ఊహా జగత్తులో ఎక్కువగా విహరిస్తూ ఊహలు అతిశయోక్తులతో కూడిన కల్పన ఎక్కువగా సృష్టిస్తుంటారు కానీ ఆ ఊహాజనిత ప్రపంచం నుంచి బయటకు వచ్చిన తర్వాత నిజ జీవితాన్ని ఉన్నది ఉన్నట్లుగా స్వీకరించక తప్పదు కదా? అందుకే జాషువా నిజ జీవిత అనుభవాలతో సహజ వర్ణనలు మాత్రమే చేశాడు. కవి లోకాన్ని పట్టి చూసినప్పుడు ఏ అంశాలు తన అనుభూతులకు గురిచేస్తాయో వాటిని తన కవిత్వంలో వ్యక్తపరిచాడు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంతో కూడిన సమాజ నిర్మాణం జరగాలని కోరుకున్నాడు. ఈ సమాజంలో ఉన్న మౌలికమైన సమస్య కులం. ఆ కుల నిర్మూలన జరగాలని ఆయన ఆశించాడు. కుల నిరంకుశత్వాన్ని గబ్బిలంలో అద్భుతంగా ఆవిష్కరించాడు. కులమే ఈ సమాజంలో ఉన్న సకల జనులకు బతుకు నిర్మిస్తుందని, కులమే వాళ్లకు అవకాశాలను భవిష్యత్తును కూడా నిర్ణయిస్తుందని చెప్పాడు. వ్యక్తి చైతన్యాన్ని కులము, వర్గము, ఆర్థిక పరిస్థితులు నిర్ణయిస్తాయి అన్నాడు. అట్టడుగు వర్గాల అభివద్ధికి ఎన్ని చట్టాలు చేసినా, ఎన్ని పథకాలు పెట్టినా ఆశించిన ఫలితాలు దక్కక పోవడానికి కారణం వాటిని అమలు చేసే నాయకులు, అధికారులు కులానికి అతీతులు కాకపోవడమే అనే భావన వ్యక్తపరిచాడు. చివరకు స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన న్యాయస్థానాలు కూడా కులానికి అతీతంగా లేకపోవడం వల్ల చట్టాలన్నీ నిర్వీర్యమైపోతున్నాయి. మన ప్రజాస్వామ్య రాజకీయం పూర్తిగా కులం ఆధారంగానే నడుస్తోంది. ఈ కులతత్వ సమాజం కులతత్వం ప్రభుత్వాలను, కులతత్వ అధికారులను సృష్టిస్తున్న వేళ మానవ హక్కుల కాపాడబడాలంటే కవులు, రచయితలు, కళాకారులు, బుద్ధి జీవులు సామాజిక చైతన్యం కలిగి ఉండాలి.


"భోగులహరించు భుక్తి కన్నుల జూచి
పరమ పేదలు దుఃఖపడి నీ చోటు
సాంఘిక చార పంచాస్య గర్జనమున
బెదరక జ్ఞానము పెరుగు చోటు
జాతి వైశ్యన్య రాక్షస పదాహుతి చేసి
కందక కళలు పెంపొందు చోటు
పరిపాలకక్రూర తర రాక్షసికి లొంగిపోక
స్వేచ్ఛా లక్ష్మి పొదలు చోటు"

కావాలని గబ్బిలాన్ని అర్థించాడు జాషువా. సమాజపు అంతర్చేతనంలో పాతుకుపోయిన ఈ కుల తత్వాన్ని బట్టే సమానత్వ సూత్రంపైగాక అసమానత్వం వారసత్వం పైనే ప్రజాస్వామ్యం నడుస్తూ ఉంది. ఈ వైఖరి మారనంతకాలం అట్టడుగు వర్గాల అభివద్ధి జరగదు. అసమానత్వం చిరకాలం వర్ధిల్లుతుంది. అందుకే ఈ సమాజాన్ని చైతన్య పరచడానికి జాషువా సాహిత్యం ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 1895 సెప్టెంబర్ 28న వినుకొండలో జన్మించి కుల మత వివక్షలపై, విద్వేషాలపై పదునైన అక్షరాస్త్రాలు సంధించి, విశ్వాంతరాలకు ఎదిగిన జాషువా ఇప్పుడు మరింత అవసరం, అవశ్యకం.

– గోనె లూథర్ పాల్
75691 16080

కోవిడ్ నేపథ్యంలో మేల్కొల్పే నవల

పుస్తకం



టిఎస్ఏ కృష్ణమూర్తి గారి తాజా నవల 'భయం లేని బతుకు' కోవిడ్ కాలపు భయాన్ని, బతుకుని, ఆనాటి బతుకు సూత్రాలను వివరిస్తూ సాగింది. ఈ నవలంతా ఆనాటి భయానకపు రోజులను గుర్తు చేసుకుంటూనే, కరోనా వేరియంట్ల రాక్షస మూక మళ్ళీ బలం పుంజుకుంటేనో?.. అన్న బెదురు కంటిమీద కునుకు రానీయదు, ముఖ్యంగా మరణం అంచుల వరకు ప్రయాణించి భూమ్మీద ఇంకా నూకలు మిగిల్చుకున్న వారికి.

ఎంత చీకటి రాత్రి అయినా తెల్లవారక తప్పదు అన్నట్లు, శతాబ్దాలుగా ఎన్నో సాంక్రమిక వ్యాధులు లక్షలాది ప్రజల ప్రాణాలను కాల ప్రవాహంలో కలుపుకొని, కొట్టుకుపోయినా, వాటన్నిటిలో అత్యధికంగా ప్రపంచవ్యాప్తంగా హడలెత్తించి, ఆ వ్యాధికి, నిరోధక టీకా కనిపెట్టే వరకు రెప్ప వాల్చనీయలేదు, ఊపిరి పీల్చుకోనీయలేదు. కోవిడ్ 19, వారు వీరు అన్న తేడా లేక అందరినీ భయపెట్టింది.

ఈ నవల మొత్తంలో సగం కరోనాకు సంబంధించిన పూర్తి వివరాలతో నిండి ఉంది. అప్పట్లో మాధ్యమాల్లోనూ వ్యక్తిగతంగాను అనుభవంలోకి వచ్చిన అనేక సాంకేతిక, గణాంక, రోగ సంబంధ సరికొత్త పదజాలంతో, మళ్లీ ఒకసారి గప్పున ఎగిరే ఈగలు దోమల సమూహంలా, ఆనాటి విషాదకర, భయభ్రాంతులకు గురిచేసిన ఎన్నెన్నో సంఘటనలను పూసగుచ్చినట్లు కథనం చేసి నవలీకరించారు కృష్ణమూర్తి.

శానిటరీ సూపర్వైజర్‌గా వృత్తి విరమణ చేసినందువల్లనేమో, ఒక రచయితగా, మానవీయ విలువలు, స్నేహం, కుటుంబ సంబంధాలు - వీటి సమగ్ర మూర్తిమత్వాన్ని తన వ్యక్తిత్వంగా చేసుకొని సార్థక జీవితం గడుపుతున్న సీమ తెలుగు రచయితల్లో సీనియర్ మోస్ట్ సమర్థ రచయిత వీరు.

సంఘటనల పరిణామక్రమం, తన బంధువులు స్నేహితులు, తెలిసిన వారి చుట్టూ పరిభ్రమించిన, విగత జీవులు లేదా బతికి బట్ట కట్టిన వారిగురించో, చదివిన పాఠకులు ప్రతి ఒక్కరూ తమ తమ వ్యక్తిగత, సామాజిక జీవితంలోకి తొంగిచూసుకొనేటట్లు చేస్తుంది ఈ నవల. కరోనా సంక్రమించినప్పటి నుంచి శ్మశాన భూమికి తరలింపబడే వరకు సాగిన ఆనాటి భీతావహ పరిస్థితులను కళ్లకు కట్టారు రచయిత. హాస్పిటల్స్‌లో బెడ్ల కొరత, ఆక్సిజన్ కొరత ఒక పక్కన; ప్రభుత్వం ఉదారంగా కోవిడ్ చికిత్సా కేంద్రాలను నెలకొల్పి సమర్థవంతంగా నిర్వహించిన తీరును, ఆనాటి కర్ఫ్యూ వాతావరణం, గృహ నిర్బంధం, బారికేడ్లు, వీధుల్ని మూసేయడం, నిత్య అవసరాల లభ్యత, వాటిని పరిశుభ్రం చేసుకున్న తీరు, ప్రయాణ అవరోధాలు, ఆసుపత్రుల దారుణ దోపిడీ; శవాలను తాకకుండా, పూర్తిగా చూడకుండా, ముఖం చూపించి కవర్ జిప్ లాగేసి, పూడ్చివేసే లేదా దహనం చేసే సందర్భాలూ ... ఇలా ఎలాంటి అమానవీయ పరిస్థితులు నెలకొని ఉన్నవో వివరించారు. ఈ పరిస్థితి రోగులు, రోగి కుటుంబీకులు, బంధుమిత్రులు ఎలా మానసికంగా కుంగిపోయేలా, హడలెత్తిపోయేలా చేసిందో... ఆర్ద్రంగా చిత్రీకరించారు.

అలాంటి పరిస్థితుల్లో కూడా రచయిత కుటుంబం ఉదారంగా, సౌజన్య మనస్కతతో వ్యవహరించిన తీరు ప్రశంసనీయం. కుటుంబ కేంద్రంగానే కాక, స్నేహ బంధు వర్గంతో తన దైనందిన జీవితాన్ని ముడి వేసుకున్న కృష్ణమూర్తి గారి జీవిత డైరీలోని సజీవ స్పందన కలిగిన అక్షర వాక్య సమూహం.. ఈ నవల. జన సమూహ జ్ఞాపకశక్తి, వ్యక్తి జ్ఞాపకశక్తి, దాని ప్రభావాన్ని బట్టి త్వరగానో, ఆలస్యంగానో మరుపుకు గురిచేస్తుంది కానీ, చరిత్రలో ఒక విషాద ఘట్టాన్ని మరల పునస్సమీక్షించుకుంటే కృష్ణమూర్తి గారికి కలిగిన భావాలు, అక్షరబద్ధం చేసిన సంఘటనల సందోహం, కొద్ది సంవత్సరాల క్రితమే జరిగినదైన ఈ సంఘటనను, ఇప్పటి తరం వారందరూ ప్రత్యక్షంగా, స్వయంగా అనుభవించిన దుర్దినాలే అవి. దాదాపు ప్రతి కుటుంబంలోని ఒకరు కరోనాకు బలి కావడం, గురికావడం కానీ, దాని కోరల నుంచి బయటపడిన వారు కావడమో జరిగినదే కాబట్టి, మొత్తమ్మీద ఈ నవల పాఠకులందరినీ వారి వారి జీవితాలపై లోతుగానో తేలికగానో ప్రభావితం చేసిన తీరును గుర్తుచేస్తుంది. అదే ఈ నవలను చరిత్రలో నిలుపుతుంది.

ఈ రకమైన కథలు, కవితలు, మరెన్నో సాహిత్య ప్రక్రియల్లో వచ్చినా.. నవలగా దీని స్థానం దీనిదే. ఆ విధంగా టీఎస్ఏకె రచనా కేతనం సదా రెపరెపలాడుతూనే ఉంటుంది. భవిష్యత్తులో రచయితలకు ఒక నమూనాగా నిలుస్తుంది. ప్రతి శతాబ్దంలో లేదా అర్థ శతాబ్దానికో సంభవించే ఇలాంటి ప్రాకృతిక విపత్తుల గురించి మానవాళికి ఒక గుణపాఠం నేర్పుతుంది ఈ నవల సారాంశం. ఈ మహమ్మారికి ఎన్నో రూపాలు, కోణాలు ఉండి ఉండవచ్చు, ఖచ్చితంగా ఉంటాయి కూడా. ఇది ఒక రచయితగా కృష్ణమూర్తి గారి జీవిత నేపథ్యం నుండి, ఆయనకు కూసు విద్యైన సాహిత్య ప్రక్రియలో చేసిన అభివ్యక్తి, పాఠకులతో పంచుకున్న పునరుక్తి. పుసకం కోసం రచయితను (మొబైల్ నెంబర్ : 93472 98942) సంప్రదించొచ్చు.

– మల్లేశ్వరరావు ఆకుల
79818 72656

ఆధునికాంధ్ర సాహిత్యంపై ఓ ప్రామాణిక గ్రంథం తెస్తా



ఇటీవల బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, వారణాసి, అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి, చెన్నై సంయుక్తంగా నిర్వహించిన శ్రీమతి మాలతీ చందూర్ గారి 'హృదయనేత్రి' నవలపై పరిశోధనాత్మక సిద్ధాంత వ్యాసాల పోటీలో కవి, రచయిత, విమర్శకుడు డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయనతో సంభాషణ... టూకీగా ...

పోటీలో విజేతగా నిలవడంపై మీ అనుభూతి?

చాలా సంతోషంగా ఉంది. ఈ పోటీలో ఒకరే విజేత. వారికి రూ.25వేలు నగదు బహుమతి ఇస్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాలే కాకుండా, తమిళనాడు వంటి ఇతర రాష్ట్రాలనుంచి కూడా ఈ పరిశోధనాత్మక సిద్ధాంత వ్యాసాలు వచ్చాయట. ముగ్గురు జడ్జీలు నిర్ణయించిన ఈ పోటీలో నా పేరు ఏకగ్రీవంగా ఎన్నికవడం సంతోషమైన విషయమే కదా. అలాగే ఈ నెలలోనే ఉభయ తెలుగు రాష్ట్రాల వారికి 'ప్రజాపద్యం' వారు నిర్వహించిన ఆధునిక పద్య నాటకాల పోటీలో కూడా ద్వితీయ బహుమతి పొందాను.

మీకు పరిశోధనా మెలకువలు ఎలా పట్టుబడ్డాయి?

డా.అద్దేపల్లి రామమోహనరావు నాకు సాహిత్య గురువు. ఆయన చెప్పిన సిద్ధాంతాల మీదనే పరిశోధనలు సాగిస్తూ ఉంటాను. అనేక పరిశోధనా గ్రంథాలను చాలా లోతుగా అధ్యయనం చేసిన అనుభవం కూడా ఉంది.

మంచి విమర్శకులుగా రచనలో మంచిచెడ్డల విశ్లేషణ ఎలా చేయాలి?

ఒక గ్రంథాన్ని చదివేటప్పుడు, ఉపరితల స్పర్శ కాకుండా అన్ని కోణాల్లో పరిశీలిస్తూ చదవాలి. అలాగే చదివేటప్పుడు దాన్లో ఉన్న ముఖ్య విషయాలను ఎప్పటికప్పుడు నోట్స్ రాసుకుంటూ ఉండాలి. మంచి విషయాలను ముందుగా చెప్పి తర్వాత లోపాలను రేఖామాత్రంగా ఎత్తి చూపాలని డా.అద్దేపల్లి ఎప్పుడూ అనేవారు.

పద్య రచయితగా మొదలై ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో కథ, వ్యాసం, విశ్లేషణ విస్తతంగా చేయడం వెనుక మీకు స్ఫూర్తి?

సహజంగా నాకు అన్ని ప్రక్రియలూ ఇష్టమే. పద్యాల్లో, కథల్లో, నాటకాల్లో, వ్యాసాల్లో అన్నింటిలోనూ బహుమతులు వచ్చాయి. పద్యం నాకు వంశానుగతంగా వచ్చిందని అనుకుంటాను. ఏ విషయమైనా చైతన్యంలో లీనమయేంతగా అధ్యయనం చేయడం చాలా అవసరమని నా అభిప్రాయం.

ఏ సాహిత్య ప్రక్రియపై శ్రద్ధ పెట్టాలనుకుంటున్నారు?

సమాజావసరాల కనుగుణంగా ఏయే ప్రక్రియలు దేనికి సరిపోతాయో అన్నింటిమీదా పరిశ్రమిస్తూనే ఉంటాను.

మీ రచనల ప్రణాళిక వివరించండి.

ప్రస్తుతానికి అన్నమాచార్య ప్రాజెక్టు వారిచ్చిన కీర్తనలకు వ్యాఖ్యానాలు రాస్తున్నాను. విమర్శ, సమీక్షలపై ఎక్కువ కషి చేయాలని అనుకుంటున్నాను.

నెల్లూరు జిల్లా అరసం ఉపాధ్యక్షునిగా అభ్యుదయ రచనలు ఏవి వెలువరించాలనుకుంటున్నారు?

ఆరుద్ర గారు వ్రాసిన 'సమగ్రాంధ్ర చరిత్ర' గానీ, సి.నా.రె గారి 'ఆధునికాంధ్ర కవిత్వం' సిద్ధాంత గ్రంథం కానీ ఒక దశ దగ్గర ఆగిపోయాయి. తరువాత వచ్చిన కవితోద్యమాలన్నీ గ్రంథాలుగా కొన్ని వచ్చినప్పటికి, సమగ్రమైన గ్రంథంగా రాలేదని నా అభిప్రాయం. ఆ పని చేయాలని డా.అద్దేపల్లి అనుకున్నారు కానీ చేయలేకపోయారు. ఆయన శిష్యుడిగా, ఆరుద్ర గారికి కొనసాగింపుగా 'ఆధునికాంధ్ర సాహిత్యం-సమగ్ర పరిశీలన' అనే ఒక ప్రామాణిక గ్రంథం రాయాలని ఉంది.

సంభాషణ : డా.పెరుగు రామకృష్ణ,
98492 30443

పుస్తకాల పురుగు



ఆ పురుగు కొందరినే తొలుస్తుంది
అంతే!
ఆ కొందరి బుర్రలూ మంత్రమేసినట్టు
మారిపోతాయి!
వారి మస్తకాలకు అక్షరాల అల్లికలు కొత్త
ఆభరణాలవుతాయి!
కొత్త వ్యక్తుల ప్రపంచంలోకి అడిగిడుతూ
బాహ్య బంధాల బంధనాలను
మర్చిపోతారు!
రంగు - రుచులను దాటి, భావాల
స్పర్శను తడుముకుంటూ
పుస్తకాల దుకాణాల్లో తప్పిపోయిన మిత్రులను
కనుగొనే ప్రయత్నం చేస్తారు!
షికార్లు - పుకార్లు, మర్యాదలు -మొహమాటాలు
వారిని ఉత్సాహపరచవు ఇక!
ఏవో తెలిసిన అనుభూతి, ఇంకా తడమని ద్వారాలు
వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తాయి!
వారి ఆతురత వైశాల్యం
పుస్తకాల అరలు కూడా కొలవలేవు!
వారి జ్ఞాన తృష్ణ ఏ పరికరానికి అందదు!
లౌక్యవాదంలోకి నెట్టినా
యథార్థవాదంలోకి తోసినా
అమాయకత్వంలోనే మిగిలిపోయినా
ఆ లోకపు దారి మాత్రం ఆ కొందరిని మార్చేస్తుంది!
ఆ లోకంలో పేద - పెద్ద, కుల-మత భేదాలే లేవు కనుక
సమాన స్థాయి వ్యక్తులు ఎదిగేలా చేసే
ఆ లోకమే
కొత్త సమాజపు పునాదుల దారి దివిటీ!
పుస్తకాల పురుగు నామధేయంతో
అక్షరాల మూటలను పుస్తకాల
బాటలను
ఆస్తులుగా పరిగణించే
ఆ కొందరి మారిన ప్రపంచమే
నిందించని మిత్రులను,
మౌనభాషణంతో మేల్కొలిపే
స్వయంగా ఎంపిక చేసుకునే పద్ధతిలో
నేస్తాలను ఆలోచనల అరల్లో
జ్ఞాన దీపపు చమురులా ప్రసాదిస్తుంది!
అదే పుస్తక పురుగుల లోకం!
రాతలు, కొట్టివేతలే తప్ప
బట్టలు, ముస్తాబులు మరిచిపోతూ
కొత్త రకమైన మనుషులు అయిపోతారు వారు ఆ లోకంలో!
చదవని పుస్తకాల లెక్కతో వ్యర్థమైన జీవితాన్ని
ఆ కొందరు ఇక లెక్కిస్తారు!
జీవించలేని క్షణాలు తరుముతున్నప్పుడు
అక్షరాల కౌగిళ్ళల్లో సేద తీరుతారు!
ఆ లోకంలోకి ఆ పురుగు వారిని లాగినప్పుడే
భిన్న జీవితపు దృక్పథంగా మారిన ఆ కొందరు
పురుగు నుంచి పరిణతి సాధించే
గొప్ప వ్యక్తులుగా కూడా ఎదుగుతారు!

– శంగవరపు రచన
9505811239

బాలాజీకి 'కె.ఎస్.విరుదు' అనువాద పురస్కారం




కథా రచయిత, అనువాదకుడు జిల్లేళ్ళ బాలాజీకి అనువాదంలో కె.ఎస్.విరుదు పురస్కారం లభించింది. తమిళనాడు కోయంబత్తూరులోని 'విజయ రీడర్స్ సర్కిల్' ఈ పురస్కారాన్ని ప్రకటించింది. ఇతర భాషల నుంతమిళంలోకీ, తమిళం నుంచి ఇతర భాషల్లోకి అనువాదం చేసే ఇద్దరికి 'విజయ రీడర్స్ సర్కిల్ కె.ఎస్.విరుదు' పురస్కారాన్ని అందిస్తారు. ఈ ఏడాదికి (2023) గాను జిల్లేళ్ళ బాలాజీకి వచ్చే అక్టోబరు నెల 8వ తారీఖున కోయంబత్తూరు వేదికగా సన్మానించి, జ్ఞాపికతో పాటు పురస్కారంగా రూ.50 వేల నగదు ఇవ్వనున్నారు. జిల్లేళ్ళ బాలాజీ 1983 నుంచి కథలు రాస్తున్నారు. ఇప్పటిదాకా 150 కి పైగా కథానికలు, 120 కి పైగా కవితలూ రాశారు. వివిధ పత్రికలు, సంస్థలు నిర్వహించిన కథల పోటీల్లో 20 కథలకు బహుమతులు లభించాయి. బాలాజీ రచనలతో పలు కథా, కవితా సంపుటాలు, నవలలు వెలువడ్డాయి.

ఈ పేజీకి వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి. అక్షరం, ప్రజాశక్తి కార్యాలయం, తాడేపల్లి, అరవిందా స్కూలు దగ్గర, గుంటూరు జిల్లా.
prajasavvadi@gmail.com

20 నెలలుగా జీతాల్లేవ్‌

- చంద్రయాన్‌-3 లాంచ్‌ప్యాడ్‌ నిర్మాణంలో భాగమైన హెచ్‌ఇసి ఉద్యోగుల దుస్థితి
- పూట గడవక కూలి పనులకు వెళ్తున్న వైనం

"చంద్రయాన్‌-3 విజయాన్ని దేశం మొత్తం సంబరాలు చేసుకుంటున్నది. దాని లాంచ్‌ ప్యాడ్‌ను తయారు చేయడానికి తమ రక్తాన్ని, చెమటను అందించిన హెచ్‌ఇసి ఇంజినీర్లు, సాంకేతిక నిపుణుల సంగతేంటి? మేము చంద్రయాన్‌-3 కోసం ఉపయోగించిన లాంచ్‌ ప్యాడ్‌ను తయారు చేశాం. కానీ ఇప్పటికీ మా జీతం కోసం ఎదురుచూస్తున్నాం" అని ప్రతిష్టాత్మకమైన ఓ ప్రభుత్వరంగసంస్థ ఉద్యోగులు ఆవేదన. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రోకు అనేక పరికరాలను అందించిన హెవీ ఇంజినీరింగ్‌ కార్పొరేషన్‌ (హెచ్‌ఇసి)కి చెందిన సాంకేతిక నిపుణులు, ఇంజినీర్లతోసహా సుమారు 3,000 మంది ఉద్యోగుల జీవితాలు దుర్భరంగా మారాయి. 20 నెలలుగా వారికి వేతనాలు అందటం లేదు. ఇప్పుడు వారు పూట గడవటం కోసం తినుబండారాలు, వస్త్రాలు అమ్మటం, ఆటోరిక్షాలు నడపటంతోసహా ఇతర రోజువారీ వేతన కార్మికులుగా పనిచేయాల్సి వస్తున్నది. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దేశాభివృద్ధికి పాటుపడే ఈ ఉన్నతోద్యోగుల స్థితి దేనికి సూచిక..? బలమైన ప్రధాని.. బలమైన ప్రభుత్వం.. అని చెప్పుకుంటున్న వారు దీనికి సమాధానం చెపుతారా...?


చంద్రయాన్‌-3 నమూనాతో హెచ్‌ఇసి ఉద్యోగులు (ఫైల్‌)

న్యూఢిల్లీ : హెచ్‌ఇసి అన్ని ప్రధాన ఉక్కు కర్మాగారాలకు పరికరాలను సరఫరా చేసే భారతదేశపు ప్రభుత్వ రంగ యూనిట్‌. బొకారో, భిలాయ్‌, రూర్కెలా, విశాఖపట్నం, దుర్గాపూర్‌లోని ప్లాంట్‌లతో సహా భారతదేశం అంతటా అనేక ప్రధాన ఉక్కు కర్మాగారాల అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషిస్తోంది. హెచ్‌ఇసి మూడు విభాగాలను కలిగి ఉన్నది. అవి.. హెవీ మెషిన్‌ టూల్స్‌ ప్లాంట్‌ (హెచ్‌ఎంటిపి), హెవీ మెషీన్స్‌ బిల్డింగ్‌ ప్లాంట్‌ (హెచ్‌ఎంబిపి), ఫౌండ్రీ ఫోర్జ్‌ ప్లాంట్‌ (ఎఫ్‌ఎఫ్‌పి). ఇవి సంయుక్తంగా పరికరాలను తయారు చేస్తాయి.

అలాంటి ప్రతిష్టాత్మకమైన సంస్థలో చాలా మంది ఉద్యోగులు ఇప్పటికే తమ ప్రావిడెంట్‌ ఫండ్‌ (పిఎఫ్‌)లో ఎక్కువ భాగాన్ని విత్‌ డ్రా చేసుకున్నారు. కొందరు బయట అప్పులు కూడా చేశారు. చివరికి దినసరి కూలీలుగా మారి కుటుంబాలను పోషించుకుంటున్నారు.

ఆటో డ్రైవర్‌గా ఉమేశ్‌ నాయక్‌

మరో ఉద్యోగి ఉమేష్‌ నాయక్‌ ఆటోరిక్షా డ్రైవర్‌గా పార్ట్‌టైమ్‌ పనిచేస్తున్నాడు. "నా కుటుంబాన్ని పోషించుకోవటానికి సాయంత్రం 5 గంటల తర్వాత నేను ఆటో నడుపుతాను. ఒక నెలలో, నేను రూ.10,000 నుండి రూ.12,000 వరకు సంపాదించగలను. ఇలా నేనొక్కడినే కాదు.. వారి కుటుంబాలను పోషించుకోవటానికి పార్ట్‌టైమ్‌ ఉద్యోగాల్లో ఉన్న అనేకమంది హెచ్‌ఇసి ఉద్యోగులు ఉన్నారు. కొందరు కూరగాయలు విక్రయిస్తుంటారు. మరికొందరు వీధి పక్కన చిరుతిండి, ఇతర తినుబండారాలను అమ్ముతున్నారు. చాలా రోజుల నుంచి మాకు జీతం రాకపోవడంతో మాకు ఓపిక నశిస్తున్నది" అని నాయక్‌ చెప్పారు.

కుటుంబంతో సహా మోమోలు అమ్ముతూ..

మరొక హెచ్‌ఇసి ఉద్యోగి అజయ్‌ మిర్ధా కుటుంబం మొత్తం మోమోలను అమ్ముతున్నారు. 'భారత ప్రభుత్వం మా బాధను అర్థం చేసుకుని మా జీతాలను విడుదల చేస్తుందని నేను ఇప్పటికీ ఆశిస్తున్నాను' అని మిర్ధా చెప్పటం గమనార్హం.

పదేళ్ల క్రితం హెచ్‌ఇసికి మోడీ..

2013 డిసెంబర్‌లో ప్రధాని మోడీ అప్పటి ఎన్నికల ర్యాలీలో ప్రసంగించడానికి రాంచీని సందర్శించారు. ఆ సమయంలో హెచ్‌ఇసి పరిస్థితిపై నిరాశ వ్యక్తం చేశారు. కేంద్రంలో ఆయన ప్రభుత్వం వచ్చి పదేళ్లు గడుస్తున్నా..

దుస్తులు విక్రయిస్తూ..



1993 నుంచి హెచ్‌ఇసిలో పనిచేస్తున్న దేవేంద్ర కుమార్‌.. పాత విధానసభ సమీపంలోని షాలిమార్‌ బజార్‌లో గంచా (టవల్స్‌), లేడీస్‌ గార్మెంట్స్‌తో సహా రెడీమేడ్‌ దుస్తులను విక్రయించాల్సి వస్తున్నది. ఇప్పటికీ హెచ్‌ఎంబిపిలో పనిచేస్తున్న కుమార్‌ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యాలయానికి హాజరవుతాడు. ఆ తర్వాత బట్టల సేల్స్‌మెన్‌ పని చేస్తాడు. కుమార్‌ రోడ్డు పక్కన ఒక తాత్కాలిక దుకాణాన్ని నడుపుతున్నాడు. బీహార్‌లోని నలంద జిల్లాకు చెందిన కుమార్‌ మాట్లాడుతూ.. "జీతం లేకుండా జీవించడం చాలా కష్టం. రాంచీలో డిగ్రీ కోర్సులు చదువుతున్న నా ముగ్గురు పిల్లల చదువుకు నేను తోడ్పాటు అందించలేకపోతున్నాను. నా పెద్ద కొడుకు మెడిసిన్‌ చదవాలనుకున్నాడు. అతని అడ్మిషన్‌ కోసం మా దగ్గర డబ్బు లేదు. మేము ఆర్థికంగా చితికిపోవటంతో ఎవరూ మాకు డబ్బు ఇవ్వని పరిస్థితి ఏర్పడింది" అని అన్నారు.



కూలీగా అశోక్‌ రామ్‌

హెచ్‌ఇసి మరో ఉద్యోగి అశోక్‌ రామ్‌.. ధ్రువ ప్రాంతంలో రోజువారీ కూలీగా మారాడు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. రామ్‌, అతని భార్య యశోదా దేవి రోజువారీ కూలీలుగా పని చేస్తూ రోజుకు రూ.450 సంపాదిస్తున్నారు. "నా పిల్లలు ప్రయివేటు స్కూల్‌లో చదివేవారు. నేను వారి ఫీజులను భరించలేక వారిని జగన్నాథ్‌పూర్‌ మాధ్యమిక పాఠశాలకు మార్చవలసి వచ్చింది" అని అశోక్‌ రామ్‌ చెప్పారు.

హెచ్‌ఇసి మూతపడే దశలో ఉన్నదని కొందరు ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

'కేంద్రం బాధ్యత వహించాలి'

"అత్యున్నత యాజమాన్యం నిజాయితీగా పని చేస్తే కార్మికులు వేతనాల్లేని పరిస్థితిని ఎదుర్కొనేవారు కాదు. కేంద్రం దీనికి బాధ్యత వహించాలి. వీలైనంత త్వరగా జీతాలు విడుదల చేయాలి" అని ఉద్యోగులు డిమాండ్‌ చేశారు. హెచ్‌ఎంటిపి ఇన్‌స్పెక్టర్‌ (క్వాలిటీ కంట్రోల్‌) కమలేష్‌ శర్మ మాట్లాడుతూ.. "2010లో మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌ కలాం హెచ్‌ఇసిని సందర్శించారు. భారత్‌కు అలాంటి సంస్థ అవసరమని నొక్కిచెప్పారు. కేంద్రంలో ప్రస్తుత ప్రభుత్వం మాత్రం గుడ్డిగా మారింది" అనిహెచ్‌ఇసి వర్కర్స్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి రామశంకర ప్రసాద్‌ విమర్శించారు.

4 రాష్ట్రాల్లోనూ గెలుస్తాం

- మధ్యప్రదేశ్‌, ఛత్తీస్‌గఢ్‌లో పక్కా
- రాహుల్‌గాంధీ



న్యూఢిల్లీ : త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే నాలుగు రాష్ట్రాల్లోనూ గెలుస్తామని కాంగ్రెస్‌ అగ్రనేత రాహుల్‌ గాంధీ ధీమా వ్యక్తం చేశారు. మధ్యప్రదేశ్‌, ఛత్తీస్‌గఢ్‌లలో కచ్చితంగా గెలుస్తామని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు విజయావకాశాలు ఉన్నాయని తెలిపారు. రాజస్థాన్‌లో విజయానికి 'అతి దగ్గర'గా ఉన్నామని చెప్పారు. 'ప్రతిదిన్‌ మీడియా నెట్‌వర్క్‌ ఆఫ్‌ అస్సాం' ఆదివారం న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాహుల్‌ గాంధీ మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసికట్టుగా పనిచేస్తున్నాయని, 2024 పార్లమెంట్‌ ఎన్నికల్లో బిజెపిని దిగ్భ్రాంతికి గురిచేయడానికి సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం దేశంలో సంపద కేంద్రీకరణ, సంపదలో భారీ అసమానతలు, తీవ్రమైన నిరుద్యోగం, భారీగా ధరల పెరుగుదల, అట్టడుగు కులాలు, ఒబిసిలు, గిరిజనులకు తీవ్ర అన్యాయం వంటి అనేక ప్రధాన సమస్యలు ఉన్నాయని అన్నారు. 'ఇలాంటి వాస్తవ సమస్యలపై బిజెపి పోరాటం చేయదు. కాబట్టే.. బిధూరి వ్యాఖ్యలు, ఒకే దేశం-ఒకే ఎన్నికలు, దేశం పేరు మార్పు.. వంటి వ్యూహాలను బిజెపి తీసుకుని వస్తుంది. మేం వాటిని ముందుకు వెళ్లనివ్వం' అని చెప్పారు. కుల గణనను దేశ ప్రజలు కోరుకుంటున్నారని, బిజెపి దానిని అంగీకరించదని రాహుల్‌ తెలిపారు. కులగణన అంశం నుంచి ప్రజలను పక్కదారి పట్టించేందుకే బిజెపి ఎంపీ రమేష్‌ బిధూడీ లోక్‌సభలో బిఎస్‌పి ఎంపీ దానిష్‌ అలీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని, ఇది బిజెపి వ్యూహంలో భాగమేనని చెప్పారు. 'మేం (కాంగ్రెస్‌) ఒక అంశాన్ని తీసుకొచ్చిన ప్రతీసారి...వారు (బిజెపి) మన దృష్టిని మరల్చడానికి (బిధూరి, నిషికాంత్‌ దూబే) లాంటి అంశాలను ఉపయోగిస్తారు. వీటిని ఎలా ఎదుర్కోవాలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల తరువాత మేం నేర్చుకున్నాం' అని రాహుల్‌ వెల్లడించారు. తెలంగాణ ఎన్నికల విషయానికి అక్కడ బిజెపి కథ ముగిసిపోయిందని రాహుల్‌ చెప్పారు. తన యూట్యూబ్‌ ఛానెల్‌, తన ట్విట్టర్‌ అన్నీ కేంద్రం ఒత్తిడికి గురవుతున్నాయని, ప్రతిపక్షాలు ఏం మాట్లాడినా జాతీయ మీడియాలో వక్రీకరణ లేకుండా సాగదని అన్నారు. 60 శాతం ప్రజల మద్దతున్న ప్రతిపక్ష పార్టీలను మీడియా పట్టించుకోవాల్సిన అవసరం ఉందని రాహుల్‌ చెప్పారు. తన భారత జోడో యాత్రను జాతీయ మీడియా పట్టించుకోక తప్పని పరిస్థితి వచ్చిందని ఆయన గుర్తు చేశారు.

లైంగికంగా వేధించే... ఏ అవకాశాన్నీ వదల్లేదు

- బ్రిజ్‌ భూషణ్‌పై ఢిల్లీ పోలీసుల నివేదిక

న్యూఢిల్లీ : భారత రెజ్లింగ్‌ సమాఖ్య (డబ్ల్యుఎఫ్‌ఐ) మాజీ చీఫ్‌, బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్‌ సింగ్‌ మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించేందుకు ఏ ఒక్క అవకాశాన్నీ వదులుకోలేదని ఢిల్లీ పోలీసులు ఆదివారం కోర్టుకు తెలిపారు. ఆయనపై అభియోగాలకు తగిన ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల కేసులో బ్రిజ్‌భూషణ్‌ పై ఢిల్లీలోని రోజ్‌ అవెన్యూ కోర్టులో విచారణ కొనసాగుతోంది. తజికిస్తాన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో నిందితుడు ఫిర్యాదుదారు (మహిళా రెజ్లర్‌)ని గదిలోకి పిలిచి బలవంతంగా కౌగిలించుకున్నాడని చెప్పారు. నిరసన వ్యక్తం చేయగా.. తండ్రిలా చేశానని అన్నాడన్నారు. నిందితుడికి తన చర్యలపై పూర్తి అవగాహన ఉందని ఈ ఘటన స్పష్టంగా తెలియజేస్తోందని పోలీసులు తెలిపారు. బాధితురాలు స్పందించిందా లేదా అన్నది ప్రశ్న కాదని, ఆమెకు అన్యాయం జరిగిందని చెప్పారు.

అమెరికాలో కాల్పులు..

- ముగ్గురు యువకులు మృతి

జార్జియా : అమెరికాలో తుపాకీ సంస్కృతి మళ్లీ పంజా విసిరింది. జార్జియా అట్లాంటాలోని ఓ షాపింగ్‌ మాల్‌లో దుండగుడు విచక్షణా రహితంగా జరిపిన కాల్పుల్లో ముగ్గురు యువకులు మృతి చెందారు. శనివారం మధ్యాహ్నం 1.30 గంటలకు (స్థానిక కాలమానం) అట్లాంటాలోని షాపింగ్‌ మాల్‌లోకి ప్రవేశించిన సాయుధుడు యువకులను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపాడని పోలీసులు తెలిపారు. ఈ ఘాతుకానికి దుండగుణ్ణి ప్రేరేపించిన అంశమేమిటన్నది తెలియాల్సి ఉందన్నారు. మృతుల్లో ఒకరికి 17, మరొకరికి 20, మూడో వ్యక్తికి 30 ఏళ్ల వయసు ఉంటుందని చెప్పారు.

నిజ్జార్‌ హత్యపై అమెరికానే ఆధారాలిచ్చింది



న్యూఢిల్లీ: న్యూయార్క్‌ సిక్కు కార్యకర్త హర్దీప్‌ సింగ్‌ నిజ్జార్‌ హత్య తరువాత అందుకు సంబంధించిన ఆధారాలను అమెరికా గూఢచారి సంస్థలు కెనడాకు అందించాయని, దాని అధారంగానే ఈ హత్యలో భారత ప్రభుత్వ పాత్రపై ఒక నిర్ధారణకు వచ్చారని 'న్యూయార్క్‌ టైమ్స్‌ (ఎన్‌వైటి) పత్రిక వెల్లడించింది. ఈ హత్యకేసులోభారత ఏజెంట్ల ప్రమేయానికి సంబంధించి అమెరికా గూఢచారి సంస్థలు అత్యంత కచ్చితమైన ఆధారాలు సేకరించాయని పేరు తెలపడానికి ఇష్టపడని అధికారి ఒకరు న్యూయార్క్‌ టైమ్స్‌కు తెలిపారు. స్మోకింగ్‌ గన్‌ ద్వారా కెనడాలో భారతీయ దౌత్యవేత్తల సమాచార మార్పిడిని ట్రాక్‌ చేసిందని ఎన్‌వైటి పేర్కొంది. కెనడాలో అమెరికా రాయబారి డేవిడ్‌ కొహెన్‌ కెడనడియన్‌ న్యూస్‌ చానెల్‌ సిటివికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయం వెల్లడించారు. నిజ్జార్‌ జూన్‌ 18న కెనడాలోని వాంకోవర్‌లో కాల్చి చంపబడ్డాడు.

ఇరకాటంలో మోడీ సర్కార్‌

భారత్‌పై కెనడా ప్రధాని జస్టిన్‌ ట్రూడో చేసిన ఆరోపణలు మోడీ ప్రభుత్వాన్ని తీవ్ర ఇరకాటంలో పడేశాయి. కెనడియన్‌ సిక్కు కార్యకర్త హరదీప్‌ సింగ్‌ నిజ్జార్‌ను కెనడా గడ్డపై హత్య గావించడం వెనక భారత ప్రభుత్వ ఏజెంట్ల హస్తం ఉందని కెనడా చేసిన ఆరోపణలపై భారత్‌ నుంచే కాకుండా పాశ్చాత్య దేశాల ప్రభుత్వాలు ప్రత్యేకించి ఫైవ్‌ ఐస్‌ గ్రూపు కూడా తీవ్రంగా రియాక్షన్‌ వచ్చింది. ఇవి ప్రపంచ వేదికపై భారత దేశ స్థానం, విశ్వసనీయతను దెబ్బ తీసే అవకాశముంది. అందులోనూ ఎన్నికల సంవత్సరంలో ఇది మోడీ ప్రభుత్వానికి తీవ్ర ఇబ్బందికరంగా పరిణమించవచ్చు. భారత ప్రభుత్వంపై ఈ ఆరోపణలు బహిరంగంగా బహిరం గంగా వచ్చాయి. దీనిపై న్యూయార్క్‌ టైమ్స్‌కు చెందిన నికోలస్‌ క్రిస్టోఫ్‌ వ్యాఖ్యానిస్తూ, నిరంకుశ ప్రభుత్వాలు అధికారంలో ఉన్న దేశాలతో ఎలా వ్యవహరించాలనేదానికి భారత్‌, కెనడా ఉదంతం ఒక హెచ్చరికగా నిలుస్తుందని అన్నారు.

వికలాంగుల సమస్యలపై దేశవ్యాప్త ఉద్యమం

- ఎన్‌పిఆర్‌డి జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం మురళీధరన్‌

ప్రజాశక్తి-న్యూఢిల్లీ

వికలాంగుల సమస్యలపై దేశవ్యాప్త ఉద్యమం చేపడతామని ఎన్‌పిఆర్‌డి జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.మురళీధరన్‌ పేర్కొన్నారు. ఆదివారం నాడిక్కడ హరికిషన్‌సింగ్‌ సుర్జీత్‌ భవన్‌లో ఎన్‌పిఆర్‌డి కేంద్ర కమిటీ సమావేశం సంఘం వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ నంబురాజన్‌ అధ్యక్షతన జరిగింది. వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై దేశవ్యాప్త ఉద్యమాలు ఉధృతం చేయాలని సమావేశం తీర్మానించింది. ఈ సందర్భంగా ఎం.మురళీధరన్‌ మాట్లాడుతూ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-6లో వికలాంగుల వివరాలు సేకరించకూడదని కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయించడం సరైంది కాదని చెప్పారు. డిపార్ట్‌మెంట్‌ ఆఫ్‌ ఎంపవర్మెంట్‌ పర్సన్‌ విత్‌ డిజేబులిటీ 2021- 22 వార్షిక నివేదిక ప్రకారం 67,09,894 మందికి యుడిఐడి కార్డులు జారీ చేశారని తెలిపారు. దేశవ్యాప్తంగా 1,74,25,094 మందికి వైకల్య ధ్రువీకరణ పత్రాలు ఇస్తే అందరికీ ఎందుకు యుడిఐడి కార్డు జారీ చేయలేదని ప్రశ్నించారు. పాఠశాలలకు వెళుతున్న వైకల్యం కలిగిన విద్యార్థులను గుర్తించేందుకు ప్రతి ఐదేళ్లకు ఒకసారి సర్వే చేయాలని 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం సెక్షన్‌ 17(ఎ) పేర్కొందని, దేశంలో ఎక్కడా ఇటువంటి సర్వేలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వికలాంగుల కోసం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాల్లో అక్రమాలు జరుగుతున్నాయని కంట్రోలర్‌ అండ్‌ ఆడిటర్‌ జనరల్‌ నివేదిక వెల్లడించిందని గుర్తు చేశారు. వికలాంగులను స్థానిక సంస్థలకు నామినేట్‌ చేసే విధంగా కేంద్రప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలని డిమాండ్‌ చేశారు. రైల్వేల్లో రాయితీ పాసులుసహా వికలాంగుల కోసం ఉన్న అనేక సంక్షేమ పథకాలను, చట్టాలను కేంద్రం అమలు చేయడం లేదని విమర్శించారు. ఉపాధి హామీ పథకంలో ప్రతి వికలాంగునికి జాబ్‌ కార్డు జారీ చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం ఆదేశించాలని డిమాండ్‌ చేశారు. వికలాంగులందరికీ అంత్యోదయ రేషన్‌ కార్డులు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ, కేంద్రం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్‌ పోస్టుల భర్తీ కోసం ప్రత్యేక నోటిఫికేషన్‌ విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు.

ఐరాసలో మరోసారి భారత్‌-పాక్‌ మాటల యుద్ధం

న్యూయార్క్‌: ఐక్యరాజ్య సమితి వేదికగా భారత్‌, పాకిస్తాన్‌ మధ్య మరోసారి మాటల యుద్ధం జరిగింది. ప్రస్తుతం జరుగుతున్న ఐరాస 78వ సర్వసభ్య సమావేశాల్లో పాకిస్తాన్‌ మరోసారి కాశ్మీర్‌ అంశాన్ని ప్రస్తావించింది. దీనికి భారత్‌ దీటుగా జవాబిచ్చింది. సమావేశంలో ఆదివారం నాడు పాకిస్తాన్‌ ఆపద్ధర్మ ప్రధాని అన్వర్‌ కాకర్‌ కాశ్మీర్‌ అంశాన్ని లేవనెత్తారు. కాశ్మీర్‌లో అక్రమ ఆక్రమణలను భారత్‌ ఖాళీ చేయాలని అన్నారు. కాశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని ఆరోపించారు. దీనిపై ఐరాసలో భారత ప్రతినిధి పటేల్‌ గెహ్లాట్‌ స్పందిస్తూ 'నిరాధార ఆరోపణలు, తప్పుడు ప్రచారంతో అంతర్జాతీయ వేదికలను దుర్వినియోగం చేయడం పాకిస్తాన్‌కు అలవాటుగా మారింది. మానవ హక్కుల విషయంలో తన దారుణమైన రికార్డు నుంచి అంతర్జాతీయ సమాజం దృష్టి మరల్చడానికే ఈ కుయుక్తులని అందరికీ తెలుసు. జమ్ముకాశ్మీర్‌, లద్దాఖ్‌ ప్రాంతాలు భారత్‌లోని అంతర్భాగాలని మేం పునరుద్ఘాటిస్తున్నాం. అక్కడి విషయాలు మా అంతర్గత వ్యవహారం. ఆ విషయాలపై మాట్లాడటానికి పాకిస్తాన్‌కు ఎలాంటి హక్కు లేదు. దక్షిణాసియాలో శాంతియుత పరిస్థితుల కోసం పాక్‌ ముందుగా మూడు పనులు చేయాల్సి ఉంది. ఒకటి.. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహించొద్దు. ఉగ్రకార్యకలాపాలను నిలిపివేయాలి. రెండు.. తన దురాక్రమణలో ఉన్న భారత భూభాగాలను వెంటనే ఖాళీ చేయాలి. మూడు.. పాకిస్తాన్‌లో మైనార్టీల హక్కుల ఉల్లంఘనను అరికట్టాలి' అని పటేల్‌ గెహ్లాట్‌ సూచించారు.

జెడి(ఎస్‌) ఉపాధ్యక్షుడి రాజీనామా

- బిజెపితో పొత్తును అంగీకరించలేమని వ్యాఖ్య

బెంగళూరు : కర్ణాటకలో జెడి(ఎస్‌)కు ఎదురుదెబ్బ తగిలింది. జెడి (ఎస్‌) ఉపాధ్యక్షుడు సయ్యద్‌ షఫీవుల్లా ఆ పార్టీకి రాజీనామా చేశారు. కులాలు, గ్రూపుల మధ్య చీలికలు తెచ్చే పార్టీతో జెడి (ఎస్‌) చేతులు కలిపిందని, ఇకపై పార్టీలో తాను కొనసాగలేనని అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బిజెపితో కలిసి పోటీ చేసేందుకు జెడి (ఎస్‌) ఎన్‌డిఎ కూటమిలో చేరిన సంగతి తెలిసిందే. "గత 30 ఏళ్లుగా జెడి (ఎస్‌)తోనే ఉన్నా. మా పార్టీ సెక్యులర్‌ అన్న భావన ఉంది. ఇప్పుడు నా పార్టీ మతాలు, కులాల మధ్య చీలికలు సృష్టించే, మతపరమైన అజెండాను ప్రచారం చేసే పార్టీతో చేతులు కలిపింది. సెక్యులర్‌ నేతలమైన మేం దానిని వ్యతిరేకిస్తున్నాం" అని ఆయన అన్నారు. కర్ణాటకలో బిజెపి పాలనలో నెలకొన్న సమస్యలను సయ్యద్‌ షఫీవుల్లా ఈ సందర్భంగా ఎత్తి చూపారు. దేశం అభివృద్ధి చెందాల్సిన మార్గం అది కాదని, ప్రజల మధ్య చిచ్చు పెట్టే బిజెపితో లౌకిక శక్తులు ఏకీభవించడం లేదని చెప్పారు.

గుజరాత్‌లో కూలిన వంతెన...

- నలుగురు గల్లంతు

గాంధీనగర్‌ : ప్రధాని మోడీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో వంతెనలు కూలిపోతున్నాయి. గతేడాది మోర్బీ ప్రాంతంలో తీగల వంతెన కూలి వంద మందికి పైగా సందర్శకులు చనిపోయిన విషయం విదితమే. తాజాగా సురేంద్రనగర్‌ జిల్లాలో ఆదివారం ఘోర ప్రమాదం జరిగింది. అధికారులు ఇచ్చిన సమాచారం ప్రకారం, సురేంద్రనగర్‌ జిల్లా వస్తాడి గ్రామ సమీపంలో జాతీయ రహదారిని కలుపుతూ వంతెన నిర్మించారు. వాహనాలు వెళ్తుండగా... వంతెన అమాంతంగా పేకమేడలా కూలిపోయింది. ట్రక్కులతోసహా పలు వాహనాలు నదిలో పడిపోయాయి. ఆ వాహనాల్లో ఉన్న పదిమంది మునిగిపోయారు, వారిలో ఆరుగురిని కాపాడారు. గల్లంతైన వారి కోసం రెస్క్యూ టీములు గాలిస్తున్నాయి.

ఉచిత వైద్యంలో కేరళకు అగ్రస్థానం

- జాతీయస్థాయిలో రెండు అవార్డులు

తిరువనంతపురం : దేశంలోనే ఉచిత వైద్యం అందించడంలో అగ్రస్థానంలో ఉన్న రాష్ట్రంగా కేరళకు 2023 ఆరోగ్య మంథన్‌ అవార్డు లభించింది. రాష్ట్రంలోని కారుణ్య ఆరోగ్య సకారుక్య పథకం (సిఎఎస్‌పి) వినియోగానికి సంబంధించి ఈ అవార్డును కైవసం చేసుకుంది. ఎబిపిఎంజెఎవై వార్షిక వేడుకలకు సంబంధించి నేషనల్‌ హెల్త్‌ అథారిటీ ఆరోగ్యమంతన్‌ 2023 అవార్డులు ప్రకటించింది. దృష్టి లోపం ఉన్న లబ్ధిదారులకు ప్రత్యేక సేవలు అందించినందుకుగానూ రాష్ట్రానికి "ఉత్తమ కార్యకలాపాలు" విభాగంలో అవార్డు లభించింది. కేరళ ఈ అవార్డును గెలుచుకోవడం వరుసగా ఇది మూడోసారి.

రూ.3,200 కోట్లకుపైగా ఉచిత వైద్య చికిత్సలు

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పేద రోగులకు వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి, కార్యక్రమాలకు కూడా ఈ అవార్డు దక్కిందని ఆరోగ్య మంత్రి వీణా జార్జ్‌ అన్నారు. రాష్ట్రంలో గత రెండేళ్లలో సిఎఎస్‌పి సహా వివిధ పథకాల ద్వారా రూ.3,200 కోట్లకు పైగా ఉచిత వైద్య చికిత్సలు అందించామని తెలిపారు. గత రెండేళ్లలో దాదాపు 13 లక్షల మంది లబ్ధిదారులు సిఎఎస్‌పి పథకం కింద చికిత్స పొందారని పేర్కొన్నారు. ఈ అంశంలో గతేడాది కేంద్ర వాటాగా రాష్ట్రానికి రూ.151 కోట్లు మాత్రమే వచ్చాయని తెలిపారు.

ఎల్‌డిఎఫ్‌ హయాంలోనే... దృష్టిలోపం ఉన్న వారి కోసం ప్రత్యేక సేవలు

ఎల్‌డిఎఫ్‌ ప్రభుత్వ హయాంలోనే దృష్టి లోపం ఉన్న లబ్ధిదారుల కోసం ప్రత్యేక సేవలను ప్రారంభించారు. ఇందుకోసం వారి చికిత్స కార్డు బ్రెయిలీలో సెట్‌ చేశారు. దీనిని పరిగణనలోకి తీసుకుని రాష్ట్రానికి ప్రత్యేక అవార్డు లభించింది. ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలోని స్టేట్‌ హెల్త్‌ ఏజెన్సీ ద్వారా రాష్ట్రంలో ఈ పథకం అమలు చేయబడుతుంది. ప్రభుత్వ, ప్రైవేట్‌ రంగాలలోని 613 ఎంప్యానెల్డ్‌ ఆసుపత్రుల నుంచి లబ్ధిదారులకు ఉచిత వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి.

సోషల్‌మీడియా దుర్వినియోగం

- కాంగ్రెస్‌ తీరుపై కేరళ సిఎం విజయన్‌ ఆగ్రహం



తిరువనంతపురం : రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని సోషల్‌ మీడియాను దుర్వినియోగం చేస్తున్నారని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ విమర్శించారు. త్రికరిపూర్‌లో సిపిఎం నూతన కార్యాలయం ప్రారంభ సందర్భంగా మాట్లాడుతూ, సోషల్‌ మీడియాను వినియోగించేటప్పుడు విజ్ఞతతో వ్యవహరించాలని అన్నారు. ఇతరులను వ్యక్తిగతంగా కించపరిచేలా మన చర్యలు ఉండకూడదని చెప్పారు. రాజకీయ ప్రత్యర్థులను వేధించేందుకు ప్రధాన మీడియాతోపాటు ప్రత్యేక ఏజెన్సీలను కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్రానికి తీసుకొచ్చిందని విమర్శించారు. వాటి కోసం లక్షలాది రూపాయలను ఖర్చు చేస్తోందని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలవడంతో ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ, రాజకీయ ప్రత్యర్థుల ప్రతిష్టకు దిగజార్చేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. సోషల్‌ మీడియాలో వేధింపులకు పాల్పడేవారిని కనిపెట్టాలని సిపిఎం కార్యకర్తలకు ఆయన సూచించారు. ప్రభుత్వ అభివృద్ధి పథకాలు, కార్యక్రమాల గురించి విస్తృతంగా చర్చల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. తిరువనంతపురంలోని పరశాలకు చెందిన కాంగ్రెస్‌ కార్యకర్త అబిన్‌ కోడంకర ఫేస్‌ బుక్‌ పేజీలో సిపిఎం నేతల కుటుంబంలోని మహిళల ఫొటోలను అసభ్యకరంగా మార్పు చేసి పెట్టడంతోపాటు అవమానకర వ్యాఖ్యలు చేశాడు. దీంతో, శుక్రవారం పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై సిఎం విజయన్‌ స్పందిస్తూ.. ఇటీవల విచారణలో భాగంగా ఓ కాంగ్రెస్‌ నేతను పోలీసులు అరెస్ట్‌ చేశారని చెప్పారు. రాజకీయ ప్రత్యర్థులపై దాడి చేయడానికి లక్షలాది రూపాయలను ఖర్చు చేస్తూ.. సోషల్‌మీడియాను ఎలా దుర్వినియోగం చేస్తున్నారో తాజా ఘటన ద్వారా వెల్లడైందని అన్నారు.

ఎందుకీ ద్వంద్వ ప్రమాణాలు?

- అమెరికాను నిలదీసిన రష్యన్‌ విదేశాంగ మంత్రి లావ్రోవ్‌



ఐక్యరాజ్యసమితి: గొలాన్‌ హైట్స్‌, ఉక్రెయిన్‌లోని డాన్‌బాస్‌పై అమెరికా ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నదని రష్యన్‌ విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్‌ విమర్శించారు. ఐక్యరాజ్యసమితి జనరల్‌ అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన శనివారం నాడిక్కడ మీడియా గోష్టిలో మాట్లాడారు. గొలాన్‌ హైట్స్‌ పట్ల ఒకరకమైన వైఖరి, డాన్‌బాస్‌ విషయంలో మరో రకమైన వైఖరి తీసుకోవడం అమెరికా రెండు నాల్కల ధోరణికి నిదర్శనమని లావ్రోవ్‌ విమర్శించారు. ఐరాసలో అమెరికా రాయబారి లిండా థామస్‌ గ్రీన్‌ఫీల్డ్‌ చేసిన పరస్పర విరుద్ధమైన ప్రకటనల గురించి ఆయన ప్రస్తావిస్తూ, డాన్‌బాస్‌ ప్రాంతం రష్యాకు భద్రత రీత్యా చాలా కీలకమని అన్నారు. ఉక్రెయిన్‌లో జెలెన్‌స్కీ అధికారంలో ఉన్నంతకాలం, ఉక్రెయిన్‌లో నాటో దళాలు తిష్టవేసుక్కూర్చొన్నంత కాలం, రష్యాకు వ్యతిరేకంగా సాయుధ గ్రూపులను నాటో ఎగదోస్తునంత కాలం, రష్యా భద్రతకు ముప్పుగానే దానిని పరిగణిస్తామని అన్నారు. డాన్‌బాస్‌ ప్రాంతంపై తాము ఆచరణాత్మక దృక్పథంతో ముందుకెళ్తున్నామని రష్యన్‌ విదేశాంగ మంత్రి చెప్పారు. ఉక్రెయిన్‌లో పరిస్థితులు మారితే, అప్పుడు పునరాలోచన చేయాల్సి ఉంటుందని, అయితే సమీప భవిష్యత్తులో అటువంటి పరిస్థితి ఏదీ ఉన్నట్టు అనిపించడం లేదన్నారు. రెండున్నరేళ్లక్రితం అమెరికన్‌ విదేశాంగ మంత్రి బ్లింకెన్‌ సిఎన్‌ఎన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూ పాఠాన్ని లావ్రోవ్‌ ఈ సందర్భంగా మీడియా ముందు చదివి వినిపించారు. బ్లింకెన్‌ ఆ ఇంటర్వ్యూలో ఏమన్నారంటే, 'ఆచరణాత్మక దృష్టితో చూస్తే, గొలాన్‌ హైట్స్‌ ఇజ్రాయిల్‌ భద్రతకు చాలా ముఖ్యం. సిరియాలో అసద్‌ ప్రభుత్వం ఉన్నంతకాలం, సిరియాకు ఇరాన్‌ వత్తాసు పలుకుతున్నంతకాలం, తీవ్రవాద గ్రూపులను సిరియాలోని అసద్‌ ప్రభుత్వం ఎగదోస్తున్నంత కాలం గొలాన్‌ హైట్స్‌ ఇజ్రాయిల్‌ భద్రతకు ముప్పుగానే పరిగణించాల్సి ఉంటుంది. అందుకే ఆ ప్రాంతంపై ఇజ్రాయిల్‌ నియంత్రణ తప్పనిసరి'. అంటూ భారీ డైలాగులు చెప్పారు. దీనిపై లావ్రోవ్‌ స్పందిస్తూ, రష్యా భద్రత ఇజ్రాయిల్‌ భద్రత లాంటిది కాదా అని అడిగారు. అదే సమయంలో గొలాన్‌ హైట్స్‌ గురించి ఐక్యరాజ్య సమితిలో అమెరికా రాయబారి లిండా థామస్‌ మాట్లాడుతూ, సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతను గౌరవించాల్సిన అవసరం ఐరాసలో సభ్యత్వం కలిగిన ప్రతి దేశంపైనా ఉందన్నారు. అమెరికా చెప్పే మాటలకు, చేతలకు ఎక్కడా పొంతనే ఉండదని లావ్రోవ్‌ విమర్శించారు. 1967, 1981యుద్ధాల తరువాత ఇజ్రాయిల్‌ ఆక్రమించుకున్న సిరియా భూభాగాలపై ఇజ్రాయిల్‌ సార్వభౌమత్వాన్ని గుర్తిస్తూ 2019లో ఒక డిక్రీపై ట్రంప్‌ సంతకం చేసిన విషయాన్ని లావ్రోవ్‌ గుర్తు చేశారు.

మమ్మల్ని పక్కన పెట్టొద్దు

- భాగస్వాములుగా చూడండి
- ఐరాస వేదికపై ఆఫ్రికన్‌ నేతల ఉద్ఘాటన


దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రమ ఫొసా

ఐక్యరాజ్యసమితి: ఈ సంవత్సరం ఐక్యరాజ్యసమితి జనరల్‌ అసెంబ్లీ సమావేశంలో మాట్లాడిన ఆఫ్రికన్‌ నేతల ప్రసంగాలను మీరు వింటే, వారంతా ముక్త కంఠంతో ఒక విషయాన్ని స్పష్టం చేశారు. రెండవ ప్రపంచ యుద్ధానంతర క్రమంలో తమ ఖండం బాధితురాలుగా ఉంది. ఇది ఒక ప్రపంచ శక్తి. దీనిని పక్కన పెట్టడం కాదు, తప్పనిసరిగా భాగస్వామిని చేసుకోవాలి అన్నదే ఆ సందేశం. ఆఫ్రికాలో ఎక్కువ భాగం స్వాతంత్ర్యం పొందింది. ఈ ఖండం 130 కోట్ల మందికిపైగా జనాభా కలిగిఉంది.దాని అభివృద్ధిని తొక్కిపెట్టే యత్నాల పట్ల అది అప్రమత్తమవుతోంది. ఈ నేపథ్యంలోనే బ్రిక్స్‌లో రెండు ఆఫ్రికన్‌ దేశాలను చేర్చుకోవడం, జి-20లో ఆఫ్రికన్‌ యూనియన్‌కు చోటు కల్పించడం జరిగింది. 'ఆఫ్రికాగా మేము ప్రపంచానికి ఒక్కటే చెప్పదలిచాము. మీరేదో భిక్షగానో, దాతృత్వంతోనో మా పట్ల వ్యవహరించాలని మేము కోరడం లేదు. మిగతా ప్రపంచంతో సమంగా కలసి పనిచేయడానికి భాగస్వాముల్ని చేసుకోండి' అని కెన్యా అధ్యక్షుడు విలియం రుటో చెప్పారు. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రమ ఫొసా మాట్లాడుతూ, దోపిడీ, లొంగుబాటు వంటి వాటికి స్వస్తి పలికి మానవ పురోభివృద్ధిలో ఆఫ్రికా తన స్థానాన్ని తిరిగి పొందేందుకు సిద్ధంగా ఉందన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

ఆదర్శ కమ్యూనిస్టు కొరటాల

కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, సిఐటియు రాష్ట్ర నాయకులు కె.ఉమామహేశ్వరరావు, డివైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. గుంటూరులోని సిపిఎం జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు ప్రసంగించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ప్రజాశక్తి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కొరటాల శతజయంతి ఉత్సవాల ప్రారంభంలో ప్రజాశక్తి ఎడిటర్‌ బి తులసీదాస్‌ మాట్లాడారు. ప్రజాశక్తి దినపత్రికను అన్ని వర్గాల ప్రజలకూ చేరువ అయ్యేలా చేయడంతోపాటు విస్తరణకు కొరటాల కృషి చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో పత్రికను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రజాశక్తి సిబ్బంది కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిజిఎం వై.అచ్యుతరావు, అసిస్టెంట్‌ ఎడిటర్‌ కె.గడ్డెన్న, న్యూస్‌ ఎడిటర్‌ వి రాజగోపాలశర్మ, జనరల్‌ మేనేజర్లు హరికిశోర్‌, తిరుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో కొరటాల చిత్రపటానికి పార్టీ సీనియర్‌ నాయకులు విఎస్‌.పద్మనాభరాజు, కొరటాల సత్యనారాయణ కుమారుడు రాధాకృష్ణ, మనవడు విష్ణువర్థన్‌, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, కార్పొరేటర్‌ డాక్టర్‌ బి.గంగారావు తదితరులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా అజశర్మ మాట్లాడుతూ వైజాగ్‌ స్టీల్‌ప్లాంట్‌ పోరాటంలో ఎమ్మెల్యే పదవిని తృణప్రాయంగా వదిలేసిన కమ్యూనిస్టు నాయకుల్లో సత్యనారాయణ ఒకరని తెలిపారు. సింహాచలం దేవస్థానం భూ సమస్యను నాటి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి విశేష కృషి చేశారని చెప్పారు. రాధాకృష్ణ మాట్లాడుతూ నాన్న ఆశయాలతో నేటి తరం నాయకులంతా ముందుకెళ్లడం తనకెంతో ఆనందాన్నిస్తోందని తెలిపారు. ప్రజాశక్తి విశాఖ ఎడిషన్‌ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జనరల్‌ మేనేజర్‌ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొరటాల గొప్పతనాన్ని వివరించారు. అనంతపురం నగరంలోని గణేనాయక్‌ భవన్‌లో కొరటాల శత జయంతి కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. కొరటాల నిత్య అధ్యయన శీలి, సమస్యల పట్ల సమగ్ర అవగాహన ఉన్న నాయకుడని కొనియాడారు. కొరటాల శత జయంతి సందర్భంగా జెవివి ఆధ్వర్యంలో వైఎస్‌ఆర్‌ జిల్లా కడపలోని రిమ్స్‌ ఆస్పత్రిలో బాలింతల వార్డులో రొట్టెలు పంపిణీ చేశారు. తిరుపతి నగరంలోగల యశోదనగర్‌లోని ఎంబి భవన్‌లో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు, ధనలక్ష్మి మాట్లాడుతూ కొరటాల సత్యనారాయణ యువతను, విద్యార్థులను ప్రోత్సహించి సిపిఎం ఉద్యమంలోకి వచ్చేలా కృషి చేశారన్నారు. విజయనగరంలోని ఎల్‌బిజి భవనంలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ కొరటాల స్ఫూర్తితో పేద, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం, పేదల రాజ్యం కోసం ఉద్యమించాలని కోరారు. శ్రీకాకుళంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల్లో కొరటాల సత్యనారాయణ ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజాశక్తి కార్యాలయంలో కొరటాల చిత్రపటానికి ఎడిషన్‌ మేనేజర్‌ పి.కామినాయుడు తదితరులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో జరిగిన సభలో సిపిఎం కృష్ణా జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ కొరటాల సత్యనారాయణ జీవితం నేటి తరానికి ఆదర్శమన్నారు.



మీకోసం

బంగాళాదుంప ముక్కలను కట్ చేసి మజ్జిగ నీళ్లల్లో ఐదు నిమిషాల పాటు ఉంచి తర్వాత ఫ్రై చేస్తే త్వరగా వేగిపోతాయి. ముక్కలు కూడా మెత్తగా ఉంటాయి.

జీవన సౌరభం

నాయకత్వమంటే దారి పొడవునా ముందుండి నడవడం కాదు, బాట వెయ్యడం. తోవ చూపడం.

JEEVANA జీవన the family

సమతకు వారధి కావాలి



పిల్లలూ ఓ పిల్లలూ...
అరవిరిసిన ఓ మల్లెలూ..

ఉదయపు వెలుగులు రావాలి
ఉరుకున మనమూ లేవాలి

సమతకు వారధి కావాలి
మమతల భావం తేవాలి

సామరస్యంగా ఉండాలి
ఈర్ష్యా ద్వేషం పోవాలి

తరులకు నీటిని పొయ్యాలి
బరువూ, బాధ్యత మొయ్యాలి

చెడు తలపులను ముయ్యాలి
కుహూకుహూ అని కుయ్యాలి

కలుపు మొక్కలను కొయ్యాలి
వ్యర్థ వస్తువులను తియ్యాలి

– మీసాల చినగౌరినాయుడు,
94928 48564.




దారి చూపండి

పిల్లలూ, బొమ్మల్లో ఉన్న నలుగురు స్నేహితులు స్విమ్మింగ్‌పూల్‌కి వెళ్దామనుకున్నారు. ఇప్పటికే ముగ్గురు వెళ్లిపోయారు. నాలుగో వాడికి మీరు దారి చూపించండి.

నేను గీసిన బొమ్మ

డి. ఉమ,
4వ తరగతి,
దిగువ సాంబయ్య పాళెం,
తొట్టంబేడు మండలం,
తిరుపతి జిల్లా.






పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

విద్యాబోధనతో పిల్లల్లో ఐక్యతా భావం


పసితనంలో వివక్షకు గురైన పిల్లలు తీవ్ర ఒత్తిడి, అభద్రత, ఆగ్రహం, ఆత్మన్యూనతాభావానికి లోనవుతారు. లేదా తామిక్కడ ఉండటానికి తగినవాళ్లం కాదన్న ఒంటరి భావానికి గురికావొచ్చు. తమిళనాడు తెన్‌కాశి వీరకేరళంపుదూర్ ప్రభుత్వ పాఠశాలలో ఒకప్పుడు ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. ఈ ప్రాంతంలో నివసించే ప్రజల్లో ఎక్కువమంది కార్మికులు, పేదలు. వారి పిల్లల్లో కొంతమంది కళ్ళు నక్షత్రాన్ని (లోపల గుడ్డుభాగంలో కనిపించేలా) పోలినట్లుగా ఉండటం వారికి శాపంగా మారింది. ఇలాంటి వారిని పాఠశాలలో మిగతా పిల్లలు వేరుగా చూడటం ఆనవాయితీగా మారింది. దీనిని ఆ పాఠశాల ఉపాధ్యాయురాలు మాలతి ఎస్.చక్కదిద్దారు.

మాలతి ఆ స్కూల్లో టీచరుగా చేరేనాటికి ఒక రకమైన వాతావరణం ఉంది. కళ్లు సరిగ్గా లేని పిల్లలను మిగతావారు దూరం పెట్టేవారు. వెక్కిరించేవారు. ఇది వివక్షకు గురయ్యే పిల్లల్లో ఆత్మన్యూనతకు దారి తీసేది. పిల్లల్లో అందం, అందహీనత భావం వలదనీ, దీన్ని వదలించాలని మాలతి నడుం కట్టారు. విద్యార్థులు మెరుగ్గా నేర్చుకునేందుకు అనువైన వాతావరణంగా పాఠశాలల అంతటా ఉండాలని భావించారు. ఆమె కూడా ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని. తన కుమార్తె ఉపాధ్యాయురాలిగా మారి సమాజానికి సేవ చేయాలనేది ఆమె తల్లి కోరిక. 2008లో ఆమె సైన్స్ టీచరుగా ఉపాధ్యాయ బాధ్యతల్లోకి వచ్చారు. ప్రారంభ సంవత్సరాల్లో అక్కడి విద్యార్థులకు పాఠాలు అర్థమయ్యేవి కావు. విద్యార్థులను ప్రోత్సహించటానికిగాను సమాధానాలు చెప్పిన వారికి బహుమతులు ఇవ్వటం వంటివి చేసేవారు. పిల్లలకు తరగతి గదిలో బోధన ఒక్కటే సరిపోదని భావించారు. పిల్లల కోసం రోబోటిక్స్, కోడింగ్, బొమ్మల తయారీ, తోలుబొమ్మలాట వంటి కళలను ఆమె యూట్యూబ్‌లో చేర్చుకున్నారు. ఆన్‌లైన్ కోర్సులను అభ్యసించడం ద్వారా తన భాష, కళానైపుణ్యాలను పెంపొందించుకున్నారు.

తరువాత ఆమె బోధనకు ఎంచుకున్న మార్గం 'విల్లుపాట్టు'. పాటలు పాడటం, నృత్యం చేయటం ద్వారా పిల్లలకు చదువు చెప్పటమే విల్లుపాట్టు. అది పిల్లలను ఎంతగానో ఆకట్టుకొంది. మాలతి మరుసటిరోజు చెప్పాల్సిన పాఠాలపై ప్రతిరోజూ రాత్రి రెండు గంటల పాటు సన్నద్ధమవుతారు. బోధనోపకరణాలను సిద్ధం చేసుకుంటారు. సైన్స్ పాఠాలను వివరించటానికి 'విల్లుపాట్టు' పాటలను ఉపయోగిస్తాను. ఫిజిక్స్ ప్రయోగాలను నేర్పటానికి తోలుబొమ్మలాట కళను ఉపయోగిస్తారు. తరచుగా చిన్న చిన్న ప్రాజెక్టులను పిల్లలకు ఇచ్చి చేయిస్తారు.



గృహోపకరణాల తయారీ వంటి వాటికి ప్రాధాన్యం ఇస్తున్నారు. పగిలిన అద్దాల నుండి కాలిడోస్కోప్, మెకానిజం వంటివి కూడా నేర్పిస్తారు.



అంతరాలపై 'విల్లుపాట్టు'

తల్లిదండ్రుల కష్టించే తత్వం, పని ప్రదేశాల్లో వారు చేసే శ్రమ పద్ధతులు, సరైన కూలీ డబ్బులు అందకపోవటం, అప్పులు చేస్తుండటం, పేదరికం వల్ల కలిగే సమస్యలు ... ఇలా అనేక అంశాలపై ఆమె పాటల రూపంలో పిల్లలకు వివరిస్తారు. అవి తమ గురించే అని పిల్లలు భావిస్తారు. ఆ విధంగా రోజూ ఎక్కువ మంది పిల్లలు బడికి వచ్చేలా ఆమె ప్రోత్సహించారు. పాఠాన్ని పాఠంగా వివరించటం కాక అది వారి హృదయానికి హత్తుకునేలా చెప్పాలనేది ఆమె తపన. కథలు, పాటలు, ఇతర బోధనోపకరణాలు, డిజిటల్ టూల్స్ ద్వారా పిల్లలకు వివరిస్తున్నారు. సెల్‌ఫోన్, కంప్యూటర్ వంటి మాధ్యమాలను కూడా ఉపయోగిస్తుండటంతో పిల్లల్లో ఏదో తెలుసుకోవాలని జిజ్ఞాస ఉద్భవించింది. రోజులు, నెలలు, ఏళ్ల గడిచాయి. పిల్లలు తమకు తెలియని అంశాల గురించి అడగటం, కృత్యాధార అంశాల్లో ఉత్సాహం పాల్గొనటం పిల్లల నుంచి మొదలైంది. ఈ క్రమంలో పిల్లల మధ్య అంతరాలను, వివక్షను ఆమె తొలగించారు. అందరూ కలసి మెలసి చదవడం, పాడటం, వివిధ ప్రయోగాలు చేయడం ద్వారా ఐక్యత ఏర్పడింది. ఈ నేపథ్యంలో పిల్లల్లో వచ్చిన మార్పును చూసి తల్లిదండ్రులు చాలా సంతోషించారు. పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులను, ప్రత్యేకంగా మాలతి టీచర్ కృషిని అభినందించటం మొదలెట్టారు.

కోవిడ్ కాలంలో ఆన్‌లైన్ తరగతులు


కోవిడ్–19 కాలంలో మాలతి డిజిటల్ విద్యాబోధనను సమర్ధవంతంగా నిర్వహించారు. వాస్తవానికి కరోనాకు ముందే ఆమె డిజిటల్ బోధనకు శ్రీకారం చుట్టారు. కోవిడ్ టైంలో అది బాగా ఉపయోగపడింది. ఆమె మారథాన్ ఆన్‌లైన్ టీచింగ్ తరగతులను నిర్వహించారు. వరుసగా 26 గంటల పాటు తరగతులు నిర్వహించటంలోనూ ఆమె ప్రత్యేక గుర్తింపు పొందారు.


ప్రత్యేక తరగతులతో ...

ప్రస్తుతం మాలతి టీచరు సైకాలజీలో ఎంఎస్‌సి చేస్తున్నారు. ఆమె తోటి ఉపాధ్యాయులకు సైతం విద్యాబోధనలో సరికొత్త మెలకువలను నేర్పుతున్నారు. నేటికీ ఆమె ప్రతిరోజూ సాయంత్రం 7 నుండి 8 గంటల వరకు విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ తరగతులకు రాష్ట్రవ్యాప్తంగా ఇతర పాఠశాలల విద్యార్థులూ హాజరవుతున్నారు. సెలవులు, ప్రత్యేక దినోత్సవాలు, పండుగల సందర్భంగా కూడా ఆమె ప్రత్యేక తరగతులు కొనసాగుతాయి. ఆమె సేవలను గుర్తించిన కేంద్రప్రభుత్వం ఈ ఏడాది జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందజేసింది.

తెర వెనుక నుంచి తెర పైకి ...

సినిమాల్లో నటించాలనే కోరిక చాలామందికి ఉంటుంది. కానీ, కొందరికీ ఆ అవకాశం వస్తుంది. కొందరు సినీరంగంలోని వివిధ శాఖల్లో పనిచేస్తూ, అనుకోకుండా తెర మీదికి వచ్చి ప్రేక్షకులను అలరిస్తారు. తెలుగు తెరపై అలా వెలిగిన ప్రతిభావంతులు ఎందరో ఉన్నారు. సినిమా తెర పైనా, తెర వెనుకా గొప్పగా రాణించినవారూ ఉన్నారు. కొందరు దర్శత్వం వహిస్తూనే అప్పుడప్పుడు తమ సినిమాలో ఏదో ఒక అప్రధాన పాత్ర తళుక్కున మెరిసేవారూ ఉన్నారు. దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల తాజాగా 'పెదకాపు 1'లో విలన్ పాత్రలో కనిపించబోతున్నారు. ఈ నేపథ్యంలో తెర వెనక నుంచి తెర పైకి వచ్చిన కొందరి గురించి తెలుసుకుందాం.













కె.విశ్వనాథ్ : అరుదైన చిత్రాల రూపకర్తగా ఐదు దశాబ్దాల సినీరంగ ప్రస్థానం చేశారు. తన వృత్తిని నటనగా మార్చుకుని కెమెరా వెనుకనే కాకుండా వెండితెరపైనా కూడా తన సత్తా చాటారు. అనేక కుటుంబ కథా చిత్రాల్లో నటించి మెప్పించారు. ఆయన తండ్రి చెన్నైలోని విజయవాహినీ స్టూడియోలో పనిచేసేవారు. అదే స్టూడియోలో సౌండ్ రికార్డిస్ట్‌గా చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టారు విశ్వనాథ్. తొలిసారి పాతాళభైరవి సినిమాకు అసిస్టెంట్ రికార్డిస్ట్‌గా పనిచేశారు. ఆదుర్తి సుబ్బారావు దగ్గర కొన్నాళ్లు సహాయ దర్శకుడిగా పనిచేశారు. 1965లో ఆత్మగౌరవం సినిమాకు దర్శకుడిగా అవకాశం లభించింది. తొలి సినిమాకే నంది అవార్డును అందుకున్నారు. సంగీతం లేదా నృత్యాన్ని జోడించి కథను అందమైన దృశ్యరూపంగా మలచడంలో దిట్ట. శంకరాభరణం, సాగరసంగమం, సిరిసిరిమువ్వ, స్వర్ణకమలం తదితర చిత్రాలు పలు అవార్డులను అందుకున్నారు.

దాసరి నారాయణరావు : అత్యధిక చిత్రాలకు (150) దర్శకుడిగా గిన్నిస్ రికార్డులకెక్కారు. 53 సినిమాలను స్వయంగా నిర్మించారు. 250కు పైగా చిత్రాలకు సంభాషణ రచయిత, గీత రచయితగా పనిచేశారు. తెలుగు, తమిళం, కన్నడ భాషా చిత్రాల్లో నటించారు. తెరపైనా, కెమెరా వెనుకా మెరిశారు. దర్శకుడు, నటుడిగా కూడా మెప్పించారు. తన బహుముఖ ప్రజ్ఞతో సినీ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

కె.రాఘవేంద్రరావు : తన 78 ఏళ్ల వయసులో వచ్చిన 'పెళ్లిసందడి' చిత్రంలో నటించారు. మరో చిత్రంలో కూడా నటిస్తున్నారు. దర్శకుడిగానే కాకుండా నిర్మాత, స్క్రీన్ రైటర్‌గా పనిచేశారు. నృత్యదర్శకుడిగా కూడా వ్యవహరించారు. కొన్ని హిందీ చిత్రాలకు సైతం దర్శకత్వం వహించారు.

వి.వి.వినాయక్ : దర్శకుడు వివి వినాయక్ కూడా ఠాగూర్, ఖైదీనంబర్ 150 వంటి చిత్రాల్లో అతిథి పాత్రల్లో నటించారు. జూనియర్ ఎన్టీఆర్ నటించిన ఆది (2002) సినిమాతో ఆయన దర్శకుడిగా మారారు. సీనయ్య సినిమాలో ఆయన హీరోగా నటిస్తున్నారు.

ఎస్ఎస్ రాజమౌళి : దర్శకుడు రాజమౌళి కూడా 'బాహుబలి' చిత్రంలో అతిథి పాత్రలో నటించారు. హీరో నాని ప్రధాన పాత్రలో నటించిన మజ్ను సినిమాలో కూడా కనిపించారు. బాహుబలి రెండు భాగాలు విజయవంతం కావటంతో బాలీవుడ్‌తోపాటుగా హాలీవుడ్‌లోనూ రాజమౌళికి గుర్తింపు లభించింది.

రామ్‌గోపాల్‌వర్మ : దర్శకుడు, నిర్మాత, రచయితగా రామ్‌గోపాల్‌వర్మ ప్రత్యేకంగా గుర్తింపు పొందారు. మాఫియా, హార్రర్ నేపథ్యం కలిగిన చిత్రాలను తీయడంలో సిద్ధహస్తులు. 'కోబ్రా' 2019లో నటించారు.

అనిల్ రావిపూడి 'ఎఫ్ 3' చిత్రంలో డ్రైవర్ పాత్రలో నటించారు. పూరి జగన్నాథ్ కూడా సినిమాల్లో నటించారు. నేనింతే, వ్యాపారవేత్త, టెంపర్, ఇస్మార్ట్ శంకర్ సినిమాల్లో అతిథిగా నటించారు. ప్రతి నాయక పాత్రల్లో మెప్పించిన రామిరెడ్డి తెలుగులో అంకుశం చిత్రం ద్వారా నట జీవితాన్ని ప్రారంభించారు. హైదరాబాద్‌లో ఉర్దూ పత్రికకు జర్నలిస్టుగా ఆయన పనిచేసేవారు. క్యాస్ట్యూమ్స్ కృష్ణ నిర్మాతగా 8 సినిమాలను తీశారు. నటుడుగానూ, ప్రతినాయకుడిగానూ, సహాయ నటుడుగానూ పాత్రలు పోషించారు. 1954లో చెన్నై వెళ్లి అసిస్టెంట్ కాస్ట్యూమర్‌గా పనిచేశారు. అక్కడ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. కోడి రామకృష్ణ దర్శకత్వంలో వచ్చిన భారత్‌బంద్ సినిమాతో నటుడిగా పరిచయమయ్యారు.





రోయింగ్‌లో తీన్‌మార్

- షూటింగ్‌లో డబుల్ ధమాకా
- తొలి రోజు ఐదు పతకాలు కైవసం
- 2023 హాంగ్జౌ ఆసియా క్రీడలు





హాంగ్జౌ : ఆసియా క్రీడల్లో టీమ్ ఇండియా పతక వేట ఘనంగా మొదలైంది. తొలి రోజు పోటీల్లోనే ఐదు పతకాలు దక్కించుకున్న భారత్.. శతకం దిశగా గట్టిగా బోణీ చేసింది. రోయర్లు మూడు మెడల్స్ అందించగా, షూటర్లు రెండు పతకాలు కట్టబెట్టారు. భారత మహిళల క్రికెట్ జట్టు కనీసం రజత పతకం ఖాయం చేసింది. మెన్స్ డబుల్ స్కల్ విభాగంలో అర్జున్ లాల్ జాట్, అరవింద్ సింగ్ జోడీ సిల్వర్ మెడల్ గెల్చుకోగా.. మెన్స్'ఎయిట్' విభాగంలో మనోళ్లు రజత సత్తా చూపారు. మెన్స్ పెయిర్ విభాగంలో బాబులాల్ యాదవ్, లాఖ్ రామ్ జోడీ మూడో స్థానంలో నిలిచి రజత పతకం సాధించింది.

హైలెస్సో.. హైలెస్సో : రోయింగ్‌లో భారత రోయర్లు సత్తా చాటారు. తొలుత మెన్స్ డబుల్ స్కల్‌లో అర్జున్, అరవింద్ జోడీ సిల్వర్‌తో మెరిసింది. 6.28.18 సెకండ్లలో రేసు పూర్తి చేసిన అర్జున్, అరవింద్‌లు.. చైనా రోయర్ల తర్వాత స్థానంలో నిలిచారు. 6.23.16 సెకండ్లతో చైనా పసిడి నెగ్గగా.. 6.32.42 సెకండ్లలో రేసు ముగించి ఉజ్బెకిస్థాన్ కాంస్య పతకం సాధించింది. ఇక మెన్స్ 'ఎయిట్' రేసులోనూ భారత్‌కు సిల్వర్ మెడల్ దక్కింది. నీరజ్, నరేశ్, నితీశ్, చరణ్‌జిత్, జస్విందర్, భీమ్ సింగ్, పునిత్, ఆశీష్, ధనంజయలు రోయింగ్‌లో భారత్‌కు రెండో మెడల్ అందించారు. ఇక మెన్స్ పెయిర్ విభాగంలో బాబు లాల్ యాదవ్, లేఖ్ రామ్‌లు సైతం మెరిశారు. 6.50.41 సెకండ్లలో రేసు పూర్తి చేసిన బాబులాల్, రామ్‌లు మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం అందుకున్నారు. చైనా పసిడి పతకం సాధించగా, ఉజ్బెకిస్థాన్ సిల్వర్ మెడల్ ఎగరేసుకుపోయింది.

'గురి' కుదిరింది : 19వ ఆసియా క్రీడల్లో భారత్‌కు తొలి పతకం అందించారు అమ్మాయిలు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో టీమ్ ఇండియా షూటర్లు రెండు పతకాలు గురి పెట్టారు. జట్టు విభాగంలో సిల్వర్ సాధించగా, వ్యక్తిగత విభాగంలో కాంస్యం దక్కింది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ జట్టు విభాగంలో రమిత, మెహులీ ఘోష్, ఆశి చౌదరి త్రయం గురి తప్పలేదు. 1886 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచిన మన షూటర్లు సిల్వర్ మెడల్ సాధించారు. 1896 పాయింట్లతో చైనా షూటర్ల త్రయం పసిడి పతకం నెగ్గింది. మంగోలియా షూటర్లు 1880 పాయింట్లతో కాంస్య పతకం దక్కించుకున్నారు. ఇక వ్యక్తిగత విభాగంలో రమిత కాంస్యం నెగ్గింది. రమిత 631.9 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి మెడల్ దక్కించుకోగా.. మెహులీ ఘోష్ 630.8 పాయింట్లతో నాల్గో స్థానానికి పరిమితమై తృటిలో పతకం చేజార్చుకుంది. 623.3 పాయింట్లే సాధించిన ఆశి చౌదరి 29వ స్థానానికి పరిమితమై పతక పోటీకి సైతం అర్హత సాధించలేదు.



క్రికెట్‌లో మెడల్ ఖాయం : ఆసియా క్రీడల క్రికెట్‌లో భారత్ తొలి మెడల్ ఖాయం చేసుకుంది. మహిళల విభాగంలో టీమ్ ఇండియా ఫైనల్స్‌కు చేరుకోగా.. కనీసం సిల్వర్ మెడల్ లాంఛనమైంది. ఆదివారం జరిగిన సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసిన అమ్మాయిలు 8 వికెట్ల తేడాతో ఏకపక్ష విజయం నమోదు చేశారు. స్వల్ప లక్ష్యాన్ని టీమ్ ఇండియా 8.2 ఓవర్లలో ఊదేసింది. షెఫాలీ వర్మ (17), జెమీమా రొడ్రిగస్ (20)లు ఛేదనలో మెరిశారు. దీంతో మరో 70 బంతులు మిగిలి ఉండగానే టీమ్ ఇండియా 8 వికెట్ల తేడాతో గెలుపొంది ఫైనల్లోకి అడుగుపెట్టింది. మరో సెమీఫైనల్లో పాకిస్థాన్ మహిళలపై శ్రీలంక మహిళల జట్టు ఘన విజయం సాధించింది. తొలుత పాకిస్థాన్ నిర్ణీత ఓవర్లలో 75/9 పరుగులు చేయగా.. 16.3 ఓవర్లలోనే శ్రీలంక లక్ష్యాన్ని ఛేదించి 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. నేడు జరిగే పసిడి పోరులో భారత్, శ్రీలంక తలపడనున్నాయి. కాంస్య పతక పోరులో పాకిస్థాన్, బంగ్లాదేశ్ ఢీకొట్టనున్నాయి.

శ్రేయస్, శుభ్‌మన్ శతక్కొట్టారు

- రాహుల్, సూర్య ధనాధన్
- అశ్విన్, జడేజా మాయజాలం
- రెండో వన్డేలో భారత్ ఘన విజయం

ప్రజాశక్తి - ఇండోర్ : శ్రేయస్ అయ్యర్ (105, 90 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్స్‌లు), శుభ్‌మన్ గిల్ (104, 97 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) శతక విహారం. గిల్, అయ్యర్ ఇండోర్‌లో పరుగుల వరదకు అశ్విన్, జడేజా మ్యాజిక్ తోడటంతో రెండో వన్డేలో ఆసీస్‌పై భారత్ ఘన విజయం సాధించింది. సూర్యకుమార్ యాదవ్ (72 నాటౌట్, 37 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లు), కెఎల్ రాహుల్ (52, 38 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) సైతం అర్థ సెంచరీలు బాదటంతో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 399/5 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఛేదనలో ఆస్ట్రేలియా చతికిలపడింది. ఆరంభంలో పేసర్లు, ఆ తర్వాత స్పిన్నర్ల ముందు కంగారూ బ్యాటర్లు నిలువలేకపోయారు. ఈ విజయంతో వన్డే సిరీస్ 2–0తో భారత్ వశమైంది. సిరీస్‌లో మూడో మ్యాచ్ బుధవారం రాజ్‌కోట్‌లో జరుగనుంది.



Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68